ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
శుక్రవారం 26 ఏప్రిల్ 2024

నాటి వైభవం ఏదీ..!

- జగన్ 2019 నామినేషన్ సభకు భారీగా జనసందోహం
- అప్పట్లో కలిసొచ్చిన వివేకా మర్డరు
- చంద్రబాబే చంపించారంటూ ఆరోపణలు
- సీబీఐ విచారణతో వివేకా హత్య కేసులో ఇంటిగుట్టు రట్టు
- ఎంపీ అవినాశ్‌రెడ్డి, ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డిలపై చార్జిషీట్ నమోదు
- ఈసారి నామినేషన్ బహిరంగసభకు జన స్పందన అంతంత మాత్రమే



సీఎం జగన్ సభకు అంతంత మాత్రం హాజరైన జనం

(కడప - ఆంధ్రజ్యోతి): దివంగత సీఎం రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు.. జగన్ సొంత పార్టీ పెట్టినప్పుడు.. సీఎం అయిన తరువాత తొలినాళ్లలో జగన్‌కు క్రేజీ ఉండేది. పులివెందులకు జగన్ వస్తున్నాడంటే.. జిల్లా నుంచే కాదు సీమ నుంచి అన్ని దారులు పులివెందులకే అన్నట్లుగా వాహనాలు పోటెత్తేవి. జనం కూడా ఆ విధంగా వెళ్లేవారు. అంతెందుకు 2019 అసెంబ్లీ ఎన్నికల్లో జగన్ నామినేషన్ కార్యక్రమానికి వైసీపీ కేడరు, జనం విపరీతంగా వచ్చారు. అయితే గురువారం సీఎం జగన్ నామినేషన్ సందర్భంగా పులివెందులలో ఏర్పాటు చేసిన బహిరంగసభకు వచ్చిన జనాన్ని, గత ఎన్నికల్లో జనాన్ని పరిశీలించి చూస్తే గతం ఒక వైభవం అన్నట్లుగా అనిపిస్తుందని రాజకీ పరిశీలకులు అంటున్నారు. ఆ సభకు హాజరైన జనం గురువారం నాటి సభకు హాజరైన జనం చూస్తే చాలా తేడా ఉంది. 2019, 2024 నామినేషన్ సభలను బేరీజు వేసుకుని.. ఔరా అప్పటి జనం ఏంటి, ఇప్పుడేంటి గతంలో ఒక వైభవంగా పులివెందులలో మా పార్టీ పరిస్థితి తయారైందంటూ వైసీపీ నేతలే చెప్పుకొస్తున్నారు.

2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో మార్చి 15న అజాతశత్రువుగా పేరొందిన దివంగత వైఎస్ఆర్ తమ్ముడు, సీఎం జగన్ చిన్నాన్న వైఎస్ వివేకాను ఆయన ఇంట్లోనే గొడ్డలితో దారుణంగా నరికి చంపివేశారు. అప్పట్లో ఈ హత్యను చంద్రబాబు చేపించారంటూ నారాసుర రక్తచరిత్ర అంటూ సాక్షి పత్రికలో పెద్ద బ్యానరు ఐటం వేశారు. వివేకాపై పులివెందులతో పాటు కడప జిల్లా వ్యాప్తంగా జనాల్లో మంచి అభిప్రాయం ఉంది. అన్ని పార్టీల్లో అభిమానులు ఉన్నారు. సౌమ్యుడిగా పేరొందిన వివేకా హత్యను జీర్ణించుకోలేకపోయారు. ఈ నేపథ్యంలో జగన్ ఒక్కచాన్స్ అంటూ జనం బాట పట్టడం, ఇక వివేకా హత్య సింపతీతో 2019 ఎన్నికల సందర్భంగా జగన్ నామినేషన్‌కు జనం పొట్టెత్తారు. అప్పట్లో ఎంపీ అవినాష్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, వివేకా బామ్మర్ది శివప్రకాశ్‌రెడ్డిలు నామినేషన్‌లో పాల్గొన్నారు.

సీన్ కట్ చేస్తే...

వివేకా హత్య కేసులో సీబీఐ ఇంటి గుట్టును రట్టు చేసింది. సుదీర్ఘ విచారణ అనంతరం వివేకా హత్యకేసులో సీఎం జగన్ వరుసకు సోదరుడు ఎంపీ అవినాశ్‌రెడ్డి, ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డి, అవినాశ్ సన్నిహితుడు శివశంకర్‌రెడ్డితో పాటు పలువురిని చేర్చింది. చార్జ్‌షీట్ నమోదు చేసింది. ఈ కేసులో శంకర్‌రెడ్డి రిమాండు నుంచి బయటికి రాగా భాస్కర్‌రెడ్డి ఇంకా జైలులో ఉన్నాడు. అవినాష్‌రెడ్డి జైలుకు పోలేదు. అయితే వివేకా హత్య కేసులో వైఎస్ కుటుంబ సభ్యుల పాత్ర ఉందని సీబీఐ తేల్చడం సంచలనంగా మారింది. ఈ కుట్ర కోణాన్ని వైఎస్ అభిమానులు ఊహించలేదని, నిజాలు చూసి జీర్ణించుకోలేకపోయారంటారు. వివేకా హత్యపై సీఎం జగన్ సోదరి షర్మిల, వివేకా కూతురు సునీతారెడ్డిలు ఇటీవల జగన్‌పై నేరుగా అటాక్ చేస్తున్నారు. జిల్లాలో షర్మిలా బస్సు యాత్ర చేపట్టింది. 'ఒక మాజీ సీఎం వైఎస్ రాజశేఖరెడ్డి తమ్ముడు ప్రస్తుత సీఎం చిన్నాన్న హత్య కేసులోనే న్యాయం జరగలేదంటే.. ఇక సామాన్యుడికి ఎలా జరుగుతుంది. వివేకాను హత్య చేసిన వారు చట్టసభల్లోకి వెళ్లకూడదనే ఉద్దేశ్యంతో నేను కడప ఎంపీగా పోటీ చేస్తున్నా..' అంటూ షర్మిల... 'వివేకా చివరి కోరిక షర్మిలాను ఎంపీగా చూడడం' అంటూ.. సునీతలు కొంగు చాటి అడుగుతున్నాం, మీ బిడ్డలకు న్యాయం చేయండంటూ.. అడుగుతున్న తీరు జనాలను బాగా తాకినట్లుంది. షర్మిలా సభలకు జిల్లాలో మంచి స్పందన వచ్చింది. ముఖ్యంగా పులివెందులలో నిర్వహించిన రోడ్ షోకు జనం పోటెత్తారు.

జనాల కోసం ప్లాన్ చేసినా...

వివేకా హత్యలో కుట్ర కోణం జనానికి సులువగా అర్థమైందంటారు. దీంతో పాటు వైఎస్‌కు జగన్‌కు చాలా తేడా ఉందనే టాక్ ఉంది. జగన్ కేవలం కొందరికే ప్రయార్టీ ఇస్తారని.. పులివెందుల వచ్చినా కూడా బారికేడ్లు, పెద్దరక్షణ మధ్య ఉండడం, జనాల్లోకి రాకపోవడం, లబ్ధి కూడా కొందరికే చేస్తుండడం జగన్ పట్ల పులివెందులలో ఆసక్తి తగ్గిందంటారు. అందుకే జనం రాలేదంటారు. జగన్ చేపట్టిన మేమంతా బస్సు యాత్ర ఇడుపుల పాయ నుంచి మొదలైంది. వేంపల్లె మీటింగ్‌కు జనం సరిగా రాలేదు. మనం ఇన్ని కోట్లు ఖర్చు పెట్టాం, జనాలు లేకపోవడం వంటి అని జగన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ క్లాస్ పీకినట్లు సమాచారం. అందుకే బహిరంగసభను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నట్లు చెబుతారు. ప్రతి ఊరికి బస్సులు, ఇతర వెహికల్స్ ఏర్పాటు చేయడంతో పాటు ఒక్కొక్కరికి రూ.500 నుంచి 700 మధ్య డబ్బులు, బిర్యానీ ఉదయం టిఫిన్లు ఏర్పాటు చేసినట్లు చెబుతారు. పెద్దఎత్తున జనాలను తీసుకురావాలని ప్లాన్ చేసినా జన స్పందన లేకపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తుంది. సీఎం జగన్ షెడ్యూలు ప్రకారమే 9.55 నిమిషాల్లోనే సీఎస్ఐ మైదానంలో ఏర్పాటు చేసి సభా ప్రాంగణానికి చేరుకున్నారు. జగన్ మీటింగ్ అంటే భారీ సంఖ్యలో జనాలు వస్తారనుకున్నారు. అయితే సీఎస్ఐ గ్రౌండ్ మీటింగ్‌కు 2 నుంచి 3వేల మంది మధ్య హాజరయ్యారని అంటున్నారు. దీంతో వైసీపీ శ్రేణులను నిరుత్సాహానికి గురి చేసింది. గ్రౌండ్ అంతా ఖాళీగా ఉంది. మీటింగ్ స్టార్ట్ చేసిన వెంటనే జనం జారుకోవడం కనిపించింది.

వివేకాపై జగన్ వ్యాఖ్యలతో సర్వత్రా విస్మయం

సభలో సీఎం జగన్ వివేకానందరెడ్డి హత్య గురించి ప్రస్తావిస్తూ.. ఎంపీ అవినాష్‌రెడ్డి చిన్నపిల్లోడు. మా అందరి కన్నా చాలా చిన్నోడు. అటువంటి పిల్లోడి జీవితం నాశనం చేయాలని చూస్తున్నారంటూ వివేకా హత్య కేసులో అవినాశ్‌కు సంబంధంలేదంటూ జగన్‌కు వెనకేసుకువచ్చే ప్రయత్నం చేశారు. అయితే అదే సమయంలో మా చిన్నాన్నగారి విషయానికి వద్దాం.. మా చిన్నాన్న వివేకాను ఎవరు చంపారో, ఎవరు చంపించారో ఆయనకు.. ఆ దేవుడికి.. జిల్లా ప్రజలకు తెలుసు. ఏం జరిగిందన్నది తెలుసు. కానీ బురద చల్లేందుకు ఇద్దరు చెల్లెమ్మలను ఎవరు పంపారో. వారి వెనుక ఎవరున్నారో రోజూ కనిపిస్తానే ఉంది. ఇంకా ఆశ్చర్యం ఏమిటి తెలుసా.. వివేకా చిన్నాన్నను దారుణంగా చంపి అవును నేను చంపాను అని చెప్పుకుని తిరుగుతున్న హంతకుడికి మద్దతు ఇస్తున్నారు. చిన్నాన్నకు రెండో భార్య ఉన్న మాట వాస్తవం అవునా, కాదా, రెండో భార్యతో తనకు సంతానం ఉన్న మాట వాస్తవమా కాదా అంటూ జగన్ చేసిన వ్యాఖ్యలు సభకు వచ్చిన వైసీపీ శ్రేణులను తీవ్ర నిరుత్సాహానికి గురి చేసిందంటారు. మరీ ఇంత దిగజారి మాట్లాడుతారా అంటూ కరుడుగట్టిన సభకు వచ్చిన వైసీపీ కేడరు ఒకరిముఖం ఒకరు చూసుకుంటూ గుసుగుసలాడుకున్నారని చెబుతారు. ఇక సీఎం జగన్ కోసం వైసీపీ పులివెందుల, చక్రాయపేట, వేముల, వేంపల్లె, తొండూరు, లింగాల, సింహాద్రిపురం నుంచి భారీ జనసమీకరణ చేసినట్లు చెబుతారు. వాహనాలు పంపించేసి ఒక్కొక్కరికి రూ.500 నుంచి 700, క్వార్టరు మందు, ఉదయం టిఫిన్, బిర్యానీ ఇచ్చి తీసుకువచ్చినా గతంతో పోలిస్తే ఈ సారి అంత లేదని చెబుతారు.

సీఎం జగన్ పర్యటన సాగిందిలా..



పులివెందులలో బారికేడ్లు ఏర్పాటు చేయడంతో అవస్థలు పడుతున్న ప్రజలు

పులివెందుల / పులివెందుల టౌన్, ఏప్రిల్ 25: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైసీపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసేందుకు పులివెందులకు వచ్చారు. ఆయన గురువారం ఉదయం తాడేపల్లె నుంచి బయలుదేరి బాకరాపురంలోని హెలిప్యాడ్‌కు 9:30కు చేరుకున్నారు. అక్కడ నుంచి రోడ్డుమార్గాన సీఎస్ఐ చర్చి గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు 10 గంటలకు హాజరయ్యారు. ఈ సభలో ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నివాళులు అర్పించి సభను ప్రారంభించారు. దాదాపు 40 నిమి షాల పాటు ఆయన ప్రసంగం సాగింది. 10:55 గంటల ప్రాంతంలో ఆయన ప్రసంగం ముగించి అక్కడ నుంచి నామినేషన్ ప్రాంతానికి బయలుదేరి వెళ్లారు. సభ వద్ద నుంచి పూలంగళ్ల మీదుగా బోలేవార్డు, తొలగించిన బస్టాండ్‌ల మీదుగా రిటర్నింగ్ ఆఫీసర్ (ఆర్వో) కార్యాలయానికి చేరుకున్నారు. అప్పటికే నామినేషన్ పత్రాలను సిద్ధం చేసిన సీఎం ఓఎస్డీ క్రిష్ణమోహన్‌రెడ్డి సీఎం జగన్‌తో నామినేషన్ పత్రాలపై సంతకాలు చేయించి ఆయనకు అందించారు. 11:15గంటలకు ముఖ్యమంత్రి నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి వెంకటేశులుకు అందించారు. నామినేషన్ వేసేందుకు వెళ్తున్న సీఎం జగన్ వెంట ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ వైఎస్ మనోహర్ రెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ చిన్నప్పలు పాల్గొన్నారు. అక్కడ నుంచి 12గంటల ప్రాం తంలో బాకరాపురంలోని ఆయన ఇంటికి చేరుకున్నారు. అప్పటికే ఆయనను కలిసేందుకు ఎదురు చూస్తున్న పలువురు నాయకులను కలిశారు. ఈ సందర్భంగా కమలాపురం మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డికి సీఎం జగన్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ట్రాఫిక్ ఆంక్షలతో...

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నామినేషన్ దాఖలు సందర్భంగా పులివెందులలో పెట్టిన ట్రాఫిక్ ఆంక్షలతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రింగురోడ్డు నుంచి లోపలికి వెళ్లే వాహనాలకు ప్రవేశం లేకుండా ఆంక్షలు విధించారు. పట్టణం చుట్టూ ఉన్న రింగురోడ్డు సర్కిల్స్ పట్టణంలోని ప్రధాన రోడ్లు అన్నీ పోలీసులు బ్లాక్ చేయడంతో రోజు కార్యకలాపాలు సాగించే ప్రజలు ఇబ్బంది పడ్డారు. సుదూర ప్రయాణికులు గమ్యాలు చేరుకోవానికి అష్టకష్టాలు పడ్డారు. ప్రధాన రోడ్లు అన్నీ బారికేడ్లతో మోహరించారు. దీంతో పట్టణంలోకి వెళ్లడానికి ప్రయాణికులు పడ్డ కష్టాలు వర్ణనాతీతం.

నామినేషన్ల పర్వానికి తెర

- చివరి రోజు సీఎం జగన్‌తో సహా పలువురు పోటాపోటీగా నామినేషన్లు దాఖలు
- నేడు పరిశీలన
- ఉపసంహరణకు తుది గడువు 29



కమలాపురంలో నామినేషన్ పత్రాన్ని సమర్పిస్తున్న పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి, పాల్గొన్న భూపేష్‌రెడ్డి తదితరులు

(కడప - ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో కీలక ఘట్టమైన నామినేషన్ల పర్వానికి గురువారం తెర పడింది. పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలల్లో పోటీ చేసే అభ్యర్థుల నుంచి ఈ నెల 18 నుంచి నామినేషన్లు స్వీకరించారు. టీడీపీ, కాంగ్రెస్, వైసీపీ, బీజేపీ, సీపీఐ, సీపీఎం, జైబీమ్, స్వతంత్ర, ఇతర పార్టీల తరపున అభ్యర్థులు నామినేషన్లు వేశారు. టీడీపీ నుంచి కడప పార్లమెంటు అభ్యర్థిగా భూపేష్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆర్.మాధవీ, మైదుకూరు నుంచి పుట్టాసుధాకర్‌యాదవ్, ప్రొద్దుటూరు నుంచి ఎస్.వరదరాజులరెడ్డి, పులివెందుల నుంచి బీటెక్ రవి, కమలాపురం నుంచి పుత్తా చైతన్యరెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. బీజేపీ అభ్యర్థులుగా బద్వేలు నుంచి బొజ్జ రోశన్న, జమ్మలమడుగు నుంచి ఆదినారాయణరెడ్డి నామినేషన్లు వేశారు. అలాగే కాంగ్రెస్ నుంచి కడప పార్లమెంటుకు వైఎస్ షర్మిల, బద్వేలు నుంచి విజయజ్యోతి, కడప నుంచి అఫ్జల్‌ఖాన్, కమలాపురం నుంచి సీపీఐ అభ్యర్థి గాలిచంద్ర నామినేషన్ వేశారు. వైసీపీ నుంచి సిట్టింగ్ ఎంపీ అవినాశ్‌తో సహా సిట్టింగ్‌లందరూ నామినేషన్ వేశారు. నామినేషన్‌కు చివరి రోజు అయిన గురువారం పులివెందుల నుంచి సీఎం జగన్ ఉదయం 11.10 నిమిషాలకు నామినేషన్ పత్రాలను పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గ అధికారికి అందించారు. కమలాపురం నుంచి టీడీపీ అభ్యర్థి పుత్తా చైతన్యరెడ్డి రెండుసెట్లు నామినేషన్ దాఖలు చేశారు. జిల్లా వ్యాప్తంగా పలువురు చివరి రోజు నామినేషన్ వేశారు.



ప్రొద్దుటూరులో నామినేషన్ దాఖలు చేస్తున్న వరదరాజులరెడ్డి

కోదండరాముడికి చక్రస్నానం



ఒంటిమిట్ట, ఏప్రిల్ 25: కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన గురువారం ఆలయ సమీపంలోని పుష్కరిణిలో చక్రస్నానం నేత్రపర్వంగా నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని పుణ్యస్నానాలు ఆచరించారు. ఆలయంలో ఉదయం 4 గంటలకు సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి ఆలయ శుద్ధి, ఆరాధన నిర్వహించారు. ఉదయం 9.30 గంటలకు లక్ష్మణ సమేత సీతారాముల వారు తిరుచ్చిలో సుదర్శనచక్రతాళ్వార్ పల్లకిలో ఊరేగింపుగా పుష్కరిణి వద్దకు వేంచేశారు. ఉదయం 10.30 నుంచి 11.15 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు వేడుకలు, స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో సీతారామలక్ష్మణ సరసన చక్రతాళ్వార్‌లు పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనంతో అభిషేకాలు అందుకున్నారు. అనంతరం అర్చకుల వేదమంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు. రాత్రి టీటీడీ అర్చకులు, వేద పండితులు శాస్త్రోక్తంగా ధ్వజారోహణం నిర్వహించారు. కోదండరామస్వామి వారి బ్రహ్మోత్సవాలు గురువారం సాయంత్రంతో ముగియనున్నారు.

స్మగ్లర్లతో సంబంధాలున్న వారికి బేడీలు వేయిస్తాం

- ఎర్రచందనంలో దోచిన డబ్బును కక్కిస్తాం
- మంగంపేటలో జరిగిన అక్రమాలను వెలికితీస్తాం
- అన్నమయ్య, పింఛా డ్యాంలను పునర్ నిర్మిస్తాం
- మిథున్‌రెడ్డి, అమర్‌నాథరెడ్డిలను చిత్తుచిత్తుగా ఓడించండి
- చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్ పిలుపు
- రాజంపేట, కోడూరులో బహిరంగ సభలు
- భారీగా హాజరైన జనం



రాజంపేట సభకు భారీగా హాజరైన ప్రజలు

రాజంపేట/రైల్వేకోడూరు, ఏప్రిల్ 25: ఎర్రచందనం స్మగ్లర్లతో రైల్వేకోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు భాగస్వామ్యం అయ్యాడని, వైసీపీలో ఉన్న ఎర్రస్మగ్లర్లకు బేడీలు వేయిస్తామని, ఎర్రచందనంలో దోచిన డబ్బును కక్కిస్తామని టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ తెలిపారు. వైసీపీ హయాంలో రాజంపేట నియోజకవర్గం అభివృద్ధిలో చాలా వెనుకబడిపోయిందని ఇక్కడి ప్రజల మనోభావాలకు తీవ్ర అన్యాయం జరిగిందని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రాజంపేటను జిల్లా కేంద్రం చేస్తానని హామీ ఇచ్చారు.

గురువారం సాయంత్రం మొదట రాజంపేట పాతబస్టాండు అనంతరం రైల్వేకోడూరులో జరిగిన బహిరంగ సభల్లో వీరు మాట్లాడారు. రాజంపేట సభలో మొదట పవన్‌కళ్యాణ్, మాజీ ముఖ్యమంత్రి, ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంలతో కలిసి ప్రసంగించారు. అనంతరం చంద్రబాబునాయుడు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి తాను, పవన్‌కళ్యాణ్ ఒకే సభలో పాలుపంచుకోవడం ఇదే తొలిసారని చాలా ఆనందంగా ఉందని తెలిపారు. ఎంతో అనుభవజ్ఞుడైన నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి ఆదర్శ ప్రజాప్రతినిధి అని ఆయనను, రాజంపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. రాజంపేటను జిల్లా కేంద్రం కాకుండా చేసిన పాపాల పెద్దిరెడ్డి కుటుంబాన్ని చిత్తుచిత్తుగా ఓడించాలన్నారు. అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోవడంలో ప్రధాన బాధ్యులైన వైసీపీ ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని, ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమర్‌నాథరెడ్డిలను ఓడించాలని పిలుపునిచ్చారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే జిల్లాల విభజనపై పూర్తి స్థాయి సమీక్షించి రాయచోటికి ఎటువంటి అన్యాయం జరగకుండా అటు మదనపల్లెను, ఇటు రాజంపేటను జిల్లా కేంద్రం చేస్తామని తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు రాజంపేటలో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేస్తానన్నారు. రాష్ట్ర విభజన తరువాత తన హయాంలో ఒంటిమిట్ట కోదండరామాలయాన్ని టీటీడీలో విలీనం చేసి 100 కోట్లకు పైబడి ఖర్చు చేశామన్నారు. అన్నమయ్య ప్రాజెక్టు, పింఛా ప్రాజెక్టులను పునరుద్ధరిస్తామన్నారు. బాధితులకు న్యాయం చేస్తామన్నారు. ఒంటిమిట్టలో భూదాహానికి బలైన సుబ్బారావు కుమార్తె లక్ష్మీప్రసన్నకు ఉద్యోగం ఇచ్చి అన్ని విధాలా ఆదుకుంటామన్నారు.

పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ... వైసీపీని అథఃపాతాళానికి తొక్కేయాలని ఆవేశపూరితంగా పిలుపునిచ్చారు. జగన్ ప్రభుత్వం రాజంపేటకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. వారి ఇసుక దాహానికే అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయి అనేక మంది ప్రాణాలు పోగొట్టుకున్నారని, రైతులకు ఇంత వరకు న్యాయం చేయలేదన్నారు. ఈ ప్రాంతంలో ఒక్క పరిశ్రమ కూడా లేకపోవడం బాధాకరమన్నారు. పిఠాపురం వచ్చి తనను ఓడించడానికి ఎంపీ మిథున్‌రెడ్డి తన ఎమ్మెల్యేలతో, తన మందీమార్బలంతో అన్ని శక్తులు ఒడ్డుతున్నాడని అవి ఏమాత్రం సాగబోవన్నారు. పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అధికారంలో ఉండి అధికారమదంతో రౌడీయిజం చేసి కొట్టడాలు, చంపడాలు చేయడం వల్లే అనేక మంది ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. మాజీ సీఎం, ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. రాజంపేట పార్లమెంటు పరిధిలోని పాపాలరెడ్డి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన తనయుడు మిథున్‌రెడ్డిని ఓడించాలన్నారు. మైనారిటీలు బీజేపీ పట్ల అపోహలను విడనాడాలన్నారు.



రాజంపేట ఎన్నికల సభలో ఐక్యతను చాటుతున్న చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, సుగవాసి బాలసుబ్రమణ్యం

రైల్వేకోడూరులో..

గురువారం రాత్రి రైల్వేకోడూరులో జరిగిన ప్రజాగళం సభకు వారు హాజరయ్యారు. వారికి టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వరనాయుడు, టీడీపీ జిల్లా పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, రైల్వేకోడూరు పరిశీలకులు హేమాంబధరరావు, జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర తదితరులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చంద్రబాబు, పవన్‌కళ్యాణలు మాట్లాడుతూ ఎర్రచందనం చెట్లను కాపాడేందుకు టీడీపీ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందని తెలిపారు. వైసీపీ పాలనలో ఎర్రచందనం స్మగ్లర్లను పెంచి పోషించిందన్నారు. పెనగలూరు మండలానికి సోమశిల బ్యాక్ వాటర్ తెప్పించి చెరువును నింపుతామని తెలిపారు. మంగంపేటలో జరిగిన అక్రమాలను వెలికితీసి విచారణ చేస్తామన్నారు. మంగంపేట బెరైటీస్‌లో వేల టన్నుల ముగ్గురాయిని పాపాల పెద్దిరెడ్డి కుటుంబం దోచుకుందని వాటిని కక్కిస్తామని తెలిపారు. రైల్వేకోడూరులో ఉద్యాన హబ్ ఏర్పాటు చేస్తామని, రైతులు తమ పంటలను కాపాడుకుని గిట్టుబాటు ధరలకు అమ్ముకునేందుకు వీలు కల్పిస్తామన్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఉన్న సమస్యలను పరిష్కారం చేస్తామని తెలిపారు. రైల్వేకోడూరులో జనసేన పార్టీ అభ్యర్థి అరవ శ్రీధర్‌ను గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. రైల్వేకోడూరులో ఉత్సాహం చూస్తే గెలుపు సులభంగా ఉంటుందని తెలిపారు. రైల్వేకోడూరు వైసీపీ ఎమ్మెల్యేని చిత్తుచిత్తుగా ఓడించాలన్నారు. కోడూరు-వెంకటగిరి రోడ్డు పూర్తి చేస్తామన్నారు. రైల్వేకోడూరు ప్రాంతం ఉద్యాన పంటలైన అరటి, మామిడి, బొప్పాయికి లాభసాటి అయిన ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయిస్తామన్నారు. వ్యవసాయ పరంగా రైతులకు మంచి సబ్సిడీలు అందిస్తామన్నారు. రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, స్మగ్లర్ గంగిరెడ్డిలకు రైల్వేకోడూరు ప్రజలు భయపడకుండా ఓటు వేసి మార్పు తీసుకుని రావాలని పిలుపునిచ్చారు. రైల్వేకోడూరు ప్రజలకు తాము అండగా ఉంటామన్నారు. ప్రజలు డబ్బుకు లొంగకుండా ఉండాలన్నారు. రైల్వేకోడూరు నడిబొడ్డున నిలిచి బెబుతున్నాం కూటమి అధికారంలోకి వస్తుందని, రైల్వేకోడూరులో కూటమి బలపరిచిన జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్‌ను గెలిపించాలని కోరారు. రైల్వేకోడూరులో వైసీపీ వారు చేసిన అన్యాయాలు, అరాచకాలు తమకు తెలుసునని తెలిపారు. బీజేపీ రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తాను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అభివృద్ధి కోసం రూ.500 కోట్లు నిధులు మంజూరు చేశామని గుర్తు చేశారు. రైల్వేకోడూరులో జనసేన పార్టీ అభ్యర్థి అరవ శ్రీధర్‌ను, రాజంపేట పార్లమెంట్‌కు తనను ప్రజలు గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాపు నాయకులు కల్లా చలపతి, గునిపాటి కిరణ్, అనుమలగుండం చంద్రమోహన్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటలో అన్ని అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేస్తాం

- ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం





రాజంపేటను జిల్లా కేంద్రం చేస్తామని, అన్నమయ్య, పింఛా ప్రాజెక్టులను పునర్ నిర్మిస్తామని, గాలేరు-నగిరి పూర్తి చేసి నియోజకవర్గంలోని అన్ని మండలాలకు అనుసంధానం చేసి తాగు, సాగునీరు అందిస్తానని రాజంపేట ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం తెలిపారు. రాజంపేటకు వెంటనే మెడికల్ కళాశాలను తెప్పిస్తామన్నారు. తనను ఎమ్మెల్యే అభ్యర్థిగా, కిరణ్‌కుమార్‌రెడ్డిని ఎంపీ అభ్యర్థిగా గెలిపించి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేశ్‌నాయుడు, రాయచోటి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాంప్రసాద్‌రెడ్డి, బీజేపీ పార్లమెంటు అధ్యక్షుడు సాయిలోకేశ్, జనసేన పార్టీ పార్లమెంటు నాయకుడు యల్లటూరు శ్రీనివాసరాజు, రాజంపేట నియోజకవర్గ జనసేన నాయకులు అతికారి కృష్ణ, మలిశెట్టి వెంకటరమణ, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వహక కార్యదర్శులు బాలిశెట్టి హరిప్రసాద్, సుగవాసి ప్రసాద్ బాబు, వేమన సతీశ్, డాక్టర్ చెన్నూరు సుధాకర్, నియోజకవర్గ అబ్జర్వర్ దుర్గాప్రసాద్, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మోదుగుల పెంచలయ్య, పోలి సుబ్బారెడ్డి,తదితరులు పాల్గొన్నారు.



ఉద్దండుల అడ్డా.. మదనపల్లె గడ్డ..

● ప్రశాంత రాజకీయాల ఆలయం... ఆహ్లాదానికి నిలయం





మదనపల్లె, ఏప్రిల్ 25: జిల్లాలో ప్రశాంత, ఆహ్లాద వాతావరణానికి మారుపేరుగా నిలిచిన మదనపల్లె.. రాజకీయాల్లో కూడా అదే ముద్ర వేసుకుంది. రాజకీయ చైతన్యం గల మదనపల్లె నియోజకవర్గంలో ఎన్నికల వరకే పార్టీలు, వర్గాలు ఉన్నా.. తర్వాత నాయకులంతా పార్టీలకతీతంగా స్నేహపూర్వకంగా ఉండటం ఇక్కడి ప్రత్యేకత. ఇక్కడి రాజకీయ ఉద్ధండుల్లో ముఖ్యంగా కమ్యూనిస్టు యోధుడు దొడ్డా సీతారామయ్య, ఆలూరి నరసింగరావు, ఆవుల మోహన్‌రెడ్డిలు రాజకీయ ప్రముఖులు. అవిభక్త మద్రాస్ రాష్ట్రం నుంచి విడిపోయి..ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన అనంతరం ఏర్పాటైన మదనపల్లె నియోజకవర్గానికి 1952 నుంచి ఇప్పటి వరకూ 15 సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఇందులో కాంగ్రెస్ ఆరుసార్లు, టీడీపీ అయిదుసార్లు, సీపీఐ రెండుసార్లు, వైసీపీ రెండుసార్లు విజయం సాధించాయి. దొడ్డా సీతారామయ్య రెండుసార్లు గెలుపొందగా, ఆలూరి నరసింగరావు, రాటకొండ నారాయణరెడ్డి మాత్రం వరుసగా రెండుసార్లు గెలుపొందారు. తంబళ్లపల్లె మండలం రేణుమాకులపల్లెకు చెందిన ఆవుల మోహన్‌రెడ్డి 1978లో తంబళ్లపల్లె నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున మొదటిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నిక కాగా, 1989లో మదనపల్లె నుంచి విజయం సాధించారు. టీడీపీ ఆవిర్భావం తర్వాత కాంగ్రెస్ పార్టీ రెండుసార్లు గెలవగా, టీడీపీ అయిదుసార్లు విజయం సాధించింది. టీడీపీ నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించిన రాటకొండ నారాయణరెడ్డి, 1994లో గెలిచిన రాటకొండ సాగర్‌రెడ్డి, 1999లో ఎమ్మెల్యేగా ఎన్నికైన రాటకొండ శోభ సమీప బంధువులు. రాటకొండ నారాయణరెడ్డి, సాగర్‌రెడ్డి పెదనాన్న కుమారుడు కాగా, రాటకొండ శోభ..స్వయానా తమ్ముడి భార్య కావడం విశేషం.

నియోజకవర్గ నేపథ్యం..

మొదట్లో మదనపల్లె, తంబళ్లపల్లె తాలూకాల పరిధిలోని మదనపల్లె పంచాయతీ, ప్రస్తుతం మండలాలుగా పిలుస్తున్న మదనపల్లె, నిమ్మనపల్లె, కురబలకోట, బి.కొత్తకోట, తంబళ్లపల్లె తాలూకాలోని తంబళ్లపల్లె, ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం, పెద్దమండ్యంలు ఉండేవి. 2009 పునర్విభజనలో మదనపల్లె నియోజకవర్గానికి మదనపల్లె మున్సిపాలిటీ, మదనపల్లె, నిమ్మనపల్లె, అప్పటి పుంగనూరు నియోజకవర్గంలోని రామసముద్రం మండలాన్ని కలిపి మదనపల్లె నియోజకవర్గంగా ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో మదనపల్లెలోని కురబలకోట, బి.కొత్తకోట మండలాలను తంబళ్లపల్లె నియోజకవర్గంలో కలిపేశారు.

రాజకీయ ప్రముఖుల గురించి..

● నియోజకవర్గం ఆవిర్భవించిన మొదటిసారి 1952లో మదనపల్లెకు చెందిన ప్రముఖ కమ్యూనిస్టు యోధుడు దొడ్డా సీతారామయ్య ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్‌పై విజయం సాధించారు. సాదాసీదాగా ఉండే సీతారామయ్య నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తూ పేదలకోసం పోరాటాలు చేశారు. ఎమ్మెల్యే హోదాలోనూ పేదల గుడిసెల్లో బసచేసే ఆయన రాగిసంగటి, చింతపులుసు, వేరుశనగ పచ్చడిని ఇష్టపడేవారు. తాను పడుకునేందుకు ఈతచాప, సాహిత్య పుస్తకాలను తన వెంట తీసుకెళ్లడం ఈయన ప్రత్యేకత. ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు.

● సామాన్య రైతు కుటుంబానికి చెందిన ఆవుల మోహన్‌రెడ్డి తంబళ్లపల్లె మండలం రేణుమాకులపల్లెకు చెందిన వారు. అప్పటి సీఎం మర్రి చెన్నారెడ్డికి శిష్యుడు. మర్రి చెన్నారెడ్డి ఆవుల మోహన్‌రెడ్డిని దత్తపుత్రుడిగా పరిగణించేవారు. మర్రి చెన్నారెడ్డితో ఉన్న సాన్నిహిత్యంతో రెండోసారి కాంగ్రెస్ నుంచి టికెట్ దక్కించుకుని మదనపల్లె నుంచి పోటీచేసి గెలుపొందారు. ఆయన అండదండలతో నల్లారి కుటుంబానికి వ్యతిరేకంగా ఉన్న ఆవుల మోహన్‌రెడ్డి రాష్ట్ర హౌసింగ్‌బోర్డు చైర్మన్‌గా పనిచేశారు. విద్య, వైద్యం, గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనలో ఆద్యునిగా పేరుపొందారు ఆవుల మోహన్‌రెడ్డి.

● ఆలూరి నరసింగరావు స్వగ్రామం బి.కొత్తకోట మండలం గట్టు. అందుకే ఈయనను గట్టు నరసింగరావుగా పిలుస్తారు. సమితి ప్రసిడెంట్‌గా రెండుసార్లు పనిచేశారు. మాజీ ప్రధాని పి.వి.నరసింహారావు అండదండలతో కరువుకు నిలయమైన తంబళ్లపల్లెలో పెద్దేరు ప్రాజెక్టును నిర్మించారు. మదనపల్లె, తంబళ్లపల్లె రాజకీయాల్లో బలమైన కుటుంబం గట్టుది. అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు ప్రధాన అనుయాయుల్లో గట్టు ఒకరు. టి.ఎన్.కుటుంబం అండదండలున్నాళ్లూ అటు తంబళ్లపల్లె, ఇటు మదనపల్లెలో రాజకీయాల్లో రాణించారు.

సంవత్సరం	గెలుపు	ప్రత్యర్థి
1952	డి.సీతారామయ్య (సీపీఐ)	జి.శ్రీనివాసరెడ్డి (ఇండిపెండెంట్)
1955	టీజీకే గుప్త(కాంగ్రెస్)	డి.సీతారామయ్య(సీపీఐ)
1962	డి.సీతారామయ్య (సీపీఐ)	ఎన్ఆర్ కృష్ణయ్య (కాంగ్రెస్)
1967	గట్టు నరసింగరావు (కాంగ్రెస్)	ఆర్.రంగారెడ్డి (ఇండిపెండెంట్)
1972	గట్టు నరసింగరావు (కాంగ్రెస్)	ఎంఈ రెడ్డి (బీజేఎస్)
1978	జీవీ నారాయణరెడ్డి (కాంగ్రెస్)	సుంకు బలరాం(జనతా)
1983	ఆర్.నారాయణరెడ్డి (టీడీపీ)	కేఎస్ రెడ్డి (కాంగ్రెస్)
1985	ఆర్.నారాయణరెడ్డి (టీడీపీ)	ఎ.సుబ్రహ్మణ్యం (కాంగ్రెస్)
1989	ఆవులమోహన్‌రెడ్డి (కాంగ్రెస్)	ఆర్.నారాయణరెడ్డి (టీడీపీ)
1994	ఆర్.సాగర్‌రెడ్డి (టీడీపీ)	అల్లూరి సుబ్రహ్మణ్యం (కాంగ్రెస్)
1999	ఆర్.శోభ (టీడీపీ)	జి.ముజీబ్‌హుస్సేన్ (కాంగ్రెస్)
2004	డి.రమేశ్ (టీడీపీ)	జి.రాందాస్‌చౌదరి(ఇండిపెండెంట్)
2009	ఎం.షాజహాన్‌బాష (కాంగ్రెస్)	ఆర్.సాగర్‌రెడ్డి (టీడీపీ)
2014	దేశాయ్ తిప్పారెడ్డి (వైసీపీ)	చల్లపల్లె నరసింహారెడ్డి(టీడీపీ-బీజేపీ)
2019	ఎం.నవాజ్‌బాషా (వైసీపీ)	దొమ్మలపాటి రమేశ్ (టీడీపీ)

రాజకీయాలను ప్రభావితం చేసే అంశాలు..

మదనపల్లె నియోజకవర్గంలోని మదనపల్లె మున్సిపాలిటీ, మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం మండలాలు ఉన్నాయి. పట్టణంలో సుమారు 50 వేలకుపైగా ముస్లిం సామాజిక వర్గం ఓట్లు ఉన్నాయి. తర్వాత బలిజ సామాజిక వర్గానికి చెందిన ఓటర్లు అధికంగా ఉన్నారు. వీరు ఆదరించిన పార్టీ గెలుస్తుందనడంలో సందేహం లేదు.

● వాయిస్ ఉంది.. ఓట్లు లేవు



చాలా మంది నాయకులకు వాయిస్ ఉంది కాని ఓట్లు లేవు. సభలు, సమావేశాల్లో పాల్గొనే నాయకులు కొంతమంది వినసొంపుగా మాట్లాడుతుంటారు. తమ మాటల గారడీతో నాయకులు, కార్యకర్తల దగ్గర చప్పట్లు కొట్టించుకుంటారు. కానీ వీరికంటూ ఓటు బ్యాంకు ఉండదు. పట్టుమని పది ఓట్లు కూడా వీరు వేయించలేరు. ఉత్త మాటలతో కొంతమంది నేతలు ఎన్నికల్లో లబ్ధి పొందుతుంటారని రాజకీయ పరిశీలకులు పేర్కొటున్నారు. ఇలాంటి వారి మాటలను నమ్ముకుంటే ఏ పార్టీ వారైన గట్టెక్కేది కష్టమని అంటున్నారు. - రైల్వేకోడూరు

● కోవర్టులున్నారు.. జాగ్రత్త




ప్రస్తుత అన్ని పార్టీ ల్లో కోవర్టులు ఉన్నారు. వీరితో పార్టీని ముందుకు నడిపించే వారు జాగ్రత్త గా వ్యవహరించాల్సి ఉంటుంది. ఇక్కడి మాటలు, అక్కడి మాటలు ఇక్కడ కోవర్టులు చెబుతుంటారు. ఇద్దరి దగ్గర పైసలు లాగుతుంటారు. ఎన్నికలు వచ్చాయంటే కోవర్టులు వాలిపోతారు. దీనిపై పార్టీని నడిపించే వారు గుర్తించ లేకపోతున్నారని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. పార్టీ జెండాలను పట్టుకున్న వారి కంటే కోవర్టులు ఎక్కువగా లబ్ధి పొందుతున్నారు.

జెండా పట్టుకో.. రూ.500 తీసుకో..



ఏ పార్టీ లోనైనా జెండా పట్టుకుని ప్రచారానికి వెళితే రూ.500లు ఇస్తున్నారు. కూలీ, నాలీ పనులు చేసుకునే వారు ఎక్కువగా ప్రచారాల్లో కనిపిస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి ప్రచారం చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం బుక్స్ పెట్టుకుని పేర్లు రాసుకుంటారు. జెండాలు, వాటికి కట్టెలు తదితరాలు ఇస్తారు. సాయంత్రం వాటిని వెనక్కి తీసుకుని మళ్లీ ఉదయం ఇస్తారు. ప్రతి రోజు కూలీ మాదిరిగా రూ.500లు ఇచ్చేస్తారు. రోజూ అన్ని పార్టీల్లో ఈ తంతు జరుగుతోంది.

● మాటలు చెప్పే వారికే ప్రాధాన్యత



పార్టీల్లో కమ్మని మాటలు చెప్పే వారికే నాయకులు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారు. వారి వల్ల పార్టీకి ఒరిగేది ఏమి ఉండదు. మాటకారులు నాయకులు నాలుగు మాటలు చెప్పి కాసులు తీసుకుని లబ్ధి పొందుతున్నారు. ఇవి అన్ని పార్టీల్లోను జరుగుతు న్నాయి. పార్టీ కోసం నిరంతరాయంగా కష్టపడి పనిచేసే వారికి ప్రయోజనం లేకపోగా కమ్మని మాటలు చెప్పిన వారికి ప్రాధాన్యత ఇస్తున్నారని రాజకీయ నిపుణులు అంటున్నారు.

కలగా మారిన టమోటా మార్కెట్

● ఎన్నికల ముందు హామీలు
● ఎన్నాళ్లు చెబుతారు అబద్ధాలు
● 15 ఏళ్లుగా దేవపట్ల టమోటా మార్కెట్ కోసం ఎదురుచూపులే

సంబేపల్లె, ఏప్రిల్ 25: జిల్లాలో రాయచోటి నియోజకవర్గ కరువు పీడిత ప్రాంతం. ఈ ప్రాంతంలో రైతులు ఎక్కువగా టమోటా పంట సాగు చేస్తున్నారు. ధరలు ఉంటే దిగుబడి ఉండదు. దిగుబడి ఉంటే ధర ఉండదు. రైతు పండించిన పంట దాచుకోవడానికి కోల్డ్ స్టోరేజ్ లేవు. ప్రతియేటా రైతులకు నష్టాలు తప్పడం లేదు. 2009 ఎన్నికలు వచ్చినప్పుడు రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి దేవపట్లలో టమోటా రైతుల ప్రయోజనం కోసం టమోటా మార్కెట్, కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేస్తామని శిలాఫ లకాలు ఏర్పాటు చేశారు. అప్పటి కేంద్ర ఉక్కు సహాయం మంత్రి సాయిప్రతాప్ చేతుల మీదుగా శిలాఫలకాన్ని ప్రారంభించారు. నాయకులు ఇచ్చిన వాగ్దానం 15 ఏళ్ల అవుతున్నా ఇప్పటికీ రైతులకు కలగానే మారింది. 2009, 2014, 2019 ఎన్నికలు వచ్చినప్పుడు నాయకుల హామీలు అన్నీ అబద్ధాలే అని ప్రజలు భావిస్తు న్నారు. రాయచోటి నియోజకవర్గంలో సంబేపల్లె, చిన్నమండెం మండలాల్లో ఎక్కువగా టమోటా సాగు చేస్తున్నారు. ఒకప్పుడు సంబేపల్లె మండలం దేవపట్లలో టమోటా మార్కెట్ నిర్వహించేవారు. టమోటా బుట్టలతో, ఎడ్ల బండ్లతో జాతీయ రహదారిపై టమోటా రైతులు కిక్కిరిసి ఉండేవారు. మార్కెట్ జాతరను తలపిస్తూ ఉండేది. ఇక్కడి ప్రాంత రైతులకు టమోటా వ్యాపారం అనువుగా ఉండేది. ఢిల్లీ, ముంబై, మహారాష్ట్ర, చిత్తూరు ఆర్కాడ్ తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చేవారు టమోటా ధరలు నిలకడ లేకపోవడంతో టమోటా రైతులు నష్టాల బాట తప్పేది కాదు. అప్పట్లో టమోటా రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని టమోటా మార్కెట్‌కు స్థలాన్ని ఇచ్చేందుకు దాతలు ముందుకు వచ్చారు. 0.95 సెంట్లు స్థలం గ్రామ పంచాయతీకి ఇచ్చారు. 30-10-2009లో అప్పటి కేంద్ర ఉక్కు సహాయ మంత్రి సాయిప్రతాప్ చేతుల మీదుగా దేవపట్ల గ్రామ పంచాయతీ మార్కెట్ ప్రారంభోత్సవం చేపట్టారు. అనంతరం దాని గురించి పట్టించుకునేవారు లేరు. గత 15 సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో మార్కెట్ ఏర్పాటు చేయకపోవడంతో టమోటా రైతులకు కష్టాలు తప్పడం లేదు. ధరల నియంత్రణపై టమోటా రైతులు ఆదుకునేందుకు ఈ రెండు మండలాలకు సంబంధించి ఒక కోల్డ్ స్టోరేజ్ నిర్మాణాన్ని చేపట్టేందుకు హామీ ఇచ్చారు. ఇప్పటికీ నేతలు ఇచ్చిన హామీలు నీటి మీద రాతలు గానే ఉన్నాయి. అయితే 15 సంవత్సరాల నుంచి టమోటా మార్కెట్ ఈ ప్రాంతం నుంచి కలకడ మండలానికి తరలిపోయింది. దీంతో ఈ ప్రాంత టమోటా రైతుల సమస్యలు తప్పడం లేదు. దీంతో ఖర్చు, భారంతో పాటు వ్యయ ప్రయాసలు తప్పడం లేదంటున్నారు టమోటా రైతులు.

దేవపట్లలో టమోటా మార్కెట్ ఏర్పాటు ఇంకెన్నాళ్లు



సంబేపల్లె, చిన్నమండెం మండల ప్రాంత రైతులకు దేవపట్ల మార్కెట్ చాలా అనుకూలం. టమోటా మార్కెట్ తరలించేందుకు వాహనదారులు తక్కువ బాడుగ తీసుకునే వారు కమీషన్లు ఉండేవి కాదు. దేవపట్లలో టమోటా మార్కెట్ పెడితే బాగుంటుంది. 15 ఏళ్లుగా అబద్ధాలే చెబుతున్నారు. టమోటా మార్కెట్ ఏర్పాటు ఇంకెన్నాళ్ళు.

- నాగిరెడ్డి, టమోటా రైతు, మాదంవాండ్లపల్లె, సంబేపల్లె మండలం

దేవపట్ల టమోటా మార్కెట్ కోసం దాతలు ఇచ్చిన స్థలంలో పిచ్చి మొక్కల మధ్య ఉన్న శిలాఫలకం



జిల్లా కంట్రోల్‌లో ఉంది

● కంట్రోల్ రూమ్ నుంచి ఫిర్యాదుల పరిష్కారం
● సమస్యాత్మక కేంద్రాల్లో ప్రత్యేక నిఘా
● ఇప్పటి వరకు 767 లైసెన్స్ వెపన్స్ స్వాధీనం
● జిల్లాలో 5276 మంది బైండోవర్
● జిల్లా మొత్తం 18 ఫ్లయింగ్ స్క్వాడ్‌తో తనిఖీలు



కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

రాయచోటి(కలెక్టరేట్), ఏప్రిల్ 25: సార్వత్రిక ఎన్నికలకు అధికారులు అన్ని రకాలుగా సిద్ధంగా ఉన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి జిల్లాలో జరిగే ప్రతి విషయంపైన తగిన చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా నలుమూలల నుంచి సీ-విజిల్ యాప్ ద్వారా అందిన ఫిర్యాదులను 90 నిమిషాలలోపే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అలాగే ఐటీ అప్లికేషన్‌పైన కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారు. ఎంసీఎంసీ, కంప్లైంట్ మేనేజ్మెంట్, కమ్యూనిటీ సెల్ ద్వారా అందిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో ప్రత్యేకమైన మొబైల్ వాహనాలు పెట్టి జీపీఎస్ ద్వారా మానిటరింగ్ చేసే విధానం అందుబాటులోకి తీసుకొచ్చారు. జిల్లాలో చెక్ పోస్టు దగ్గర సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వెబ్‌కాస్ట్ ద్వారా మానిటరింగ్ చేసే విధానం అమలవుతోంది. అంతేగాకుండా రాజంపేట పార్లమెంట్ ఎక్స్పెండిచర్ మానిటరింగ్ సెల్, మానిటరింగ్ కంట్రోల్ రూమ్ కాల్ సెంటర్‌ని కూడా ఏర్పాటు చేశారు. ఎంసీఎంసీ టీంతో పాటు ప్రింట్ మీడియా మానిటరింగ్ కమిటీ సెల్, ఎలక్ట్రానిక్ మీడియా మానిటిరింగ్, సెల్ సోషల్ మీడియా మానిటరింగ్ సెల్ కూడా అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇవన్నీ కూడా 24/7 అందుబాటులో ఉండి నిరంతరం పనిచేస్తాయని అధికారులు వెల్లడించారు.

నిఘా నీడలో జిల్లా

అన్నమయ్య జిల్లాలో కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి నేటి వరకు దాదాపు 6 కోట్ల రూపాయల విలువ గల మద్యం, గంజాయి, నగదు పట్టుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇప్పటి వరకు జిల్లాలో 767 లైసెన్సులు తుపాకులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. సీఆర్‌పీసీ సెక్షన్ల కింద జిల్లాలో ఇప్పటి వరకు 828 కేసులు నమోదు చేశారు. జిల్లా మొత్తం 576 మందిని బైండోవర్ చేయడం జరిగిందని పోలీసులు మీడియా సమావేశంలో వెల్లడించారు. సెక్టోరల్ ఆఫీసర్ 42 మందితో పాటు జిల్లాలో చెక్‌పోస్టుల వద్ద దాదాపు 22 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిత్యం నిఘా పెట్టామని అధికారులు వెల్లడించారు.

కలెక్టరేట్‌లో ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూం ఏర్పాటు

జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసి నిత్యం జిల్లాలో జరుగుతున్న ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు కలెక్టర్ మీడియా సమావేశంలో వెల్లడించారు. కలెక్టరేట్‌లో ఎన్నికల విభాగం, ఎక్స్పెండిచర్ అబ్జర్వర్లు, ఎంసీఎంసీటీ ఎక్స్పెండిచర్ మానిటరింగ్ కంట్రోల్ రూం సెంటర్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా మానిటరింగ్ సెంటర్, వెబ్‌కాస్టింగ్ టీం, జీపీఆర్ఎస్ మానిటరింగ్ సెల్, రిపోర్టింగ్ మానిటరింగ్ సెల్‌తో కలిసి దాదాపు 200 మంది సిబ్బంది ఇక్కడ పనిచేస్తున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు నిత్యం కృషి చేస్తున్నారని అధికారులు తెలిపారు.



నామినేషన్ల కోసం పోలీస్ భద్రత ఏర్పాటు చేసిన దృశ్యం

చివరిరోజు నామినేషన్‌ల జోరు...

● రాజంపేట ఎంపీకి 18 మంది నామినేషన్లు

రాయచోటి (కలెక్టరేట్) ఏప్రిల్ 25: నామినేషన్లకు చివరి రోజైన గురువారం రాజంపేట ఎంపీ స్థానానికి వైసీపీకి చెందిన మిథున్‌రెడ్డి తరఫున 4వ సెట్టు నామినేషన్ వేయగా, 17 మంది ఇదివరకు వేసినవారే మళ్లీ ఇండిపెండెంట్లుగా నామినేషన్ వేశారు. మదనపల్లిలో 7 మంది నామినేషన్లు వేశారు.

టీడీపీ1, వైసీపీకి 1, ఇండిపెండెంట్లు 5 మంది నామినేషన్లు వేశారు. రైల్వేకోడూరులో 15 మంది ఇండిపెండెంట్ అభ్యర్థులుగా నామినేషన్లు వేశారు. పీలేరులో వైసీపీ తరఫున చింతల రామచంద్రారెడ్డి సతీమణి నామినేషన్ వేయగా మిగిలిన నలుగురు ఇండిపెండెంట్లుగా నామినేషన్‌లు వేశారు. తంబళ్లపల్లెలో పెద్దిరెడ్డి వెంకట అభినయ్‌రెడ్డి వైసీపీ తరఫున నామినేషన్ వేయగా, దాసరిపల్లి జయచంద్రారెడ్డి టీడీపీ తరఫున మరో సెట్టు నామినేషన్ వేశారు. మరో ముగ్గురు ఇండిపెండెంట్లుగా నామినేషన్ వేశారు.

రాజంపేటలో టీడీపీ తరుపున బాల సుబ్రమణ్యం 1 సెట్టు నామినేషన్ వేయగా, వైసీపీ తరఫున ఆకేపాటి అమర్‌నాథరెడ్డి నామినేషన్ వేశారు. వారితో పాటు మరో 8 మంది ఇండిపెండెంట్లుగా నామినేషన్ వేశారు. రాయచోటిలో కూడా 12 మంది ఇండిపెండెంట్లు నామినేషన్‌లు వేశారు.

ఎన్నికలపై ఫిర్యాదులు తెలపవచ్చు

ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు తమకు తెలియజేయవచ్చునని జిల్లాకు వచ్చిన ఎన్నికల పరిశీలకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓం ప్రకాష్ బంకర, కవిత ఎస్ మనికేరి, శాంతిభద్రతల పరిశీలకులు దిల్‌నవాజ్ అహ్మద్, ఎన్నికల వ్యయపరిశీలకులు రవీంద్రకుమార్, మరో ముగ్గురు ఐఆర్ఎస్ అధికారులు జిల్లాకు వచ్చారు. ఎన్నికలకు సంబంధించిన ఎటువంటి ఫిర్యాదులైనా అధికారుల ఫోన్ నెంబర్లు 8977946222, 8977948222, 89779949111, 89779947333 ద్వారా సమస్యలు తెలపవచ్చని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



శిథిలావస్థకు చేరిన సబ్‌రిజిస్ట్రారు కార్యాలయం

అభివృద్ధి అంటే ఇదేనా...?

- ముఖ్యమంత్రి హామీలు నీటి మూటలు
- 'మాట తప్పను మడమ తిప్పను' నినాదానికి తూట్లు



శతాబ్దం దాటిన తహసీల్దారు భవనం

\- బద్వేలు రూరల్

'బద్వేలు నియోజకవర్గంలో రూ.500 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నాం అంటూ 2021 జూలై10న ఉప ఎన్నికల్లో సీఎం జగన్ ప్రకటించారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు రూ.500 కోట్ల అభివృద్ధి. అయితే జరిగిన పనులు రూ.47 కోట్లు మాత్రమే. ప్రతిపక్ష నేత హోదాలో చాంతాడంత హామీలు ఇచ్చినా సీఎం అయ్యాక ఐదేళ్ల ఏం చేయలేకపోగా మళ్లీ వైసీపీనే గెలిపించాలంటూ ఇంటింటి ప్రచారం చేస్తుండడం గమనార్హం. గోపవరం పక్కనే సోమశిల ప్రాజెక్టు నిర్మాణం కోసం గోపవరం మండలంలో ఊర్లన్నీ ఖాళీ చేయించారు. చెంతనే నీరున్నా చుక్క కూడా ఉపయోగించలేని దుస్థితి. సోమశిల నీటిని బద్వేలు పెద్దచెరువుకు నింపితే బద్వేలు, గోపవరం మండలాలకు సాగు, తాగునీటి సమస్య తీరుతుందని ఆ ప్రాంతీయులు ఆశించారు. సోమశిల నీటి కోసం ఆందోళనలు, పాదయాత్రలు, ఉద్యమాలు చేశారు. 2018లో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక జీఓ ఇచ్చారు. ఇంతలో సార్వత్రిక ఎన్నికలు వచ్చాయి. ప్రతిపక్ష నేత హోదాలో జగన్ బద్వేలు నాలుగురోడ్ల కూడలి బహిరంగసభలో మాట్లాడుతూ మన ప్రభుత్వం వచ్చిన వెంటనే సోమశిల నుంచి 2 టీఎంసీలు కాదు 5 టీఎంసీల నీటిని ఇస్తానని జనం సాక్షిగా హామీ ఇచ్చారు. దీంతో గోపవరం, బద్వేలులో సుమారు 25వేల ఎకరాలకు నీరందుతుందని రైతులు సంతోషించారు. జగన్ హామీలకు సైతం మంగళం పాడితే అభివృద్ధి అంటే హామీలు ఇవ్వడం కాదు వాటిని అమలు చేయడమని బద్వేలు వాసులు మడ మ తిప్పిన జగన్‌కు తెలిపే యోచనలో ఉన్నారు.

తాను అధికారంలోకి వస్తే తాగు, సాగునీరు అన్నిరంగాల్లో బద్వేలు నియోజకవర్గాన్ని అభివృద్ధి పరుస్తానని ప్రతిపక్ష నేతగా 2019లో ఎన్నికల రోడ్‌షోలో హామీలు, ముఖ్యమంత్రి అయ్యాక ఉప ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నెల్లూరు బైపాస్ రోడ్డులో నిర్వహించిన బహిరంగ సభలో ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోక ఇచ్చిన హామీలు నీటిమూటలయ్యాయి. మాట తప్పం, మడమ తిప్పం నాదానికి తూట్లు పడ్డాయి.

2019 రోడ్‌షోలో ఇచ్చిన హామీలు

2019 ఎన్నికల ప్రచారంలో పట్టణంలోని నెల్లూరు రోడ్డులో నిర్వహించిన రోడ్‌షోలో సోమశిల వెనుక జలాల ద్వారా బద్వేలు, గోపవరం, అట్లూరు మండలాలకు సాగునీరందిస్తామని ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదు. సోమశిల వెనుకజలాల ఎత్తిపోతల పథకం నిర్మించినట్లయితే బద్వేలు, గోపవరం, అట్లూరు మండలాల్లోని రైతాంగానికి సాగునీరు అంది చాలా మటుకు రైతాంగ సమస్యలు పరిష్కారం అవుతాయి. అయినా ఆ హామీని నిలబెట్టుకోలేకపోయారు.

2021 సభలో ఇచ్చిన హామీలు

2021 ఉప ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పట్టణంలోని పోరుమామిళ్ల బైపాస్ రోడ్డులో నిర్వహించిన బహిరంగసభలో కుందూ నది వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రారంభించి ఆ నీటిని బ్రహ్మంసాగర్‌కు అందిస్తామని ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు. కొంత మేర పనులు ప్రారంభమైనప్పటికీ ఆ పనులు ప్రస్తుతం నిలిచిపోయాయి. దీంతో కుందూ లిఫ్ట్ ఇరిగేషన్ హామీ నీటిమూటగా మారింది. అలాగే ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి బద్వేలులో శిధిలా వస్థకు చేరుకున్న తహసీల్దారు కార్యాలయం, సబ్ రిజిస్ట్రారు కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయం నూతన భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని అడిగారని, రూ.15 కోట్లు నూతన భవనాలకు నిధులు మంజూరు చేస్తున్నామని హామీ ఇచ్చారు. మరి ఆ హామీ ఇంత వరకూ అమలు కాలేదు. ఎప్పుడూ ప్రస్తావనకు కూడా రాలేదు. దీంతో ముఖ్య మంత్రి హోదాలో జగన్ ఇచ్చిన చాలా హామీల్లో అమలుకు నోచుకోని విధంగానే బద్వేలుకు ఇచ్చిన హామీ కూడా అమలుకు నోచుకోలేక పోయాయి.

శతాబ్దం దాటిన రెండు భవనాలు

బద్వేలు తహసీల్దారు కార్యాలయానికి శతాబ్ద కాలం పూర్తయింది. దాదాపు 1900లో నిర్మించినట్లుగా చెబుతున్న కార్యాలయం శిథిలావస్థకు చేరింది. 1894లో నిర్మించిన సబ్ రిజిస్ట్రారు కార్యాలయ పరిస్థితి కూడా అలాగే ఉంది. మిగా అభివృద్ధి పనుల మాట ఎలా ఉన్నా ఈ రెండు భవనాలు శతాబ్ధ కాలం దాటింది కనుక నూతన భవనాలు నిర్మించాల్సి ఉంది. ముఖ్యమంత్రి హామీ ఇచ్చినప్పటికీ ఈ రెండు కార్యాలయాల నూతన భవనాలకు నిధులు మంజూరు కాలేదు. అధికారులు, ప్రజలు అలాగే కాలం వెల్లదీస్తున్నారు.

ప్రతిపక్ష, సీఎం హోదాలో జగన్ ఇచ్చిన హామీలు

- బద్వేలులో కూరగాయల మార్కెట్, పార్కులు, శ్మశానాల అభివృద్ధికి ఇచ్చిన హామీలు పూర్తి కాలేదు.
- నాగులచెరువును సుందరీకరణ చేపడతామన్న హామీ సైతం అటకెక్కించారు.
- పోరుమామిళ్లలో రూ.25 కోట్లతో రోడ్ల విస్తరణ పనులు చేపట్టినా అవి ముందుకు సాగడంలేదు.
- కాశినాయన మండలంలో 22 దేవాలయాలకు నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేస్తామన్న హామీ నెరవేరలేదు.
- శిధిలావస్థకు చేరుకున్న బి.కోడూరు మండలం సగిలేరు గురుకుల పాఠశాలకు అదనపు గదులు ఇస్తామని హామీ నేటికీ అలాగే నిలిచిపోయింది.
- బికోడూరు మండలం గోవిందాయపల్లెలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.
- అట్లూరు మండలం వేములూరు సగిలేరు మధ్య రూ.22 కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి సీఎం జగన్ వేసిన శిలాఫలకం అలాగే నిలిచిపోయింది.
- కుడికాల్వ పనులు పూర్తి చేసి అట్లూరుకు తెలుగంగ నీరు అందిస్తామని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు.
- కలసపాడు నుంచి బ్రాహ్మణపల్లెకు వెళ్లే దారిలో సగిలేరు వంతెనపై రూ.9.5 కోట్లతో నిర్మించే బ్రిడ్జికి సీఎం జగన్ ఉప ఎన్నికల సందర్భంగా శంకుస్థాపన చేశారు. హామీ శిలాఫలకాలకే పరిమితమైంది.
- వెలిగొండ ప్రాజెక్టు ద్వారా కలసపాడు, కాశినాయన, పోరుమామిళ్ల మండలాల్లో 25వేల ఎకరాలకు సాగు, తాగునీరు అందించేందుకు ఆ ప్రాజెక్టు డిజైన్ చేశారు. ఇంత వరకూ అది కార్య రూపం దాల్చలేదు.
- తెలుగుగంగ ప్రాజెక్టు పిల్ల కాల్వలు, ఇతర పనులు పూర్తి కాకపోవడంతో చివరి ఆయకట్టుకు నీరందని పరిస్థితి కేవలం చెరువులు నింపి వాటి ద్వారా అందిస్తున్నారు.

కమలాపురంలో.. రెడ్లదే హవా

- 15 సార్లు ఎన్నికలు • 14 సార్లు వాళ్లే • హ్యాట్రిక్ లభించని నేతలు
- ఈ సారి అభ్యర్థి నిర్ణయం మహిళల చేతుల్లోనే




నర్రెడ్డి శివరామిరెడ్డి, మొట్టమొదటి ఎమ్మెల్యే

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 25: కమలాపురం నియోజకవర్గానికి జిల్లాలో విశిష్ట స్థానం ఉంది. ఎందరో ఉద్ధండులను కమలాపురం శాసనసభ స్థానానికి ఎంపిక చేసిన ఓటర్లు మొట్టమొదటి విజయాన్ని భారత కమ్యూనిస్టు పార్టీకి అందించారు. 1951లో ఏర్పాటైన నియోజకవర్గంలో ఇప్పటి వరకు 15 సార్లు ఎన్నికలు జరిగాయి. ఇందులో రెడ్డి కులానికి చెందిన వారు 14 సార్లు గెలవగా, ఒకే ఒక్క సారి రెడ్డియేతర అభ్యర్థి గెలవడం గమనార్హం. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో టీడీపీ, వైసీపీ అభ్యర్థులుగా రెడ్డి సామాజిక వర్గం పోటీలో ఉండగా సీపీఐ నుంచి రెడ్డియే తర అభ్యర్థి పోటీలో ఉన్నారు. సీపీఐ అభ్యర్థికి కాంగ్రెస్ మద్దతు ప్రకటించింది.

తొలి ఎమ్మెల్యేగా ఎన్.శివరామిరెడ్డి

1951లో కమలాపురం నియోజకవర్గం ఏర్పడింది. తొలిసారిగా 1952లోఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థిగా నర్రెడ్డి శివరామిరెడ్డి పోటీ చేసి తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి రామలింగారెడ్డిపై విజయం సాధించారు. తొలి కమలాపురం నియోజకవర్గం ఎమ్మెల్యేగా నమోదయ్యారు. ఆ ఎన్నికల్లో 5304 ఓట్లు సాధించారు.

పదిహేను సార్లు ఎన్నికలు



నియోజకవర్గంలో 15 పర్యాయాలు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, కాంగ్రెస్-ఐ అభ్యర్థులు 8సార్లు విజయం సాధించగా, రెండు సార్లు టీడీపీ అభ్యర్థులు విజయం సాధించారు. ఒకసారి సీపీఐ, రెండు సార్లు ఇండి పెండెంట్లు, రెండు సార్లు వైసీపీ అభ్యర్థులు గెలుపొందారు. అయితే 1967లో ఇండి పెండెంట్ అభ్యర్థి పుల్లారెడ్డి సమీప కాంగ్రెస్ అభ్యర్థి వడ్డమాను వెంకటరెడ్డిపై 86 ఓట్ల అత్యల్ప ఆధిక్య తతో విజయం సాధించారు.

అభ్యర్థిని నిర్ణయించేది మహిళలే...

కమలాపురం నియోజకవర్గంలో 2024ఎన్నికల్లో అభ్యర్థిని నిర్ణయించేది మహిళా ఓటర్లే అని చెప్పాలి. నియోజకవర్గంలో 203536 మంది ఓటర్లుండగా, వీరిలో 99553 మంది పురుషులు ఓటర్లు, మహిళలు 1,03,949 మంది, థర్డ్ జండర్ 34 మంది అయితే అత్యధికంగా ఉన్న మహిళా ఓటర్లు కమలాపురం ఎమ్మెల్యే అభ్యర్థిని నిర్ణయించే అవకాశాలున్నాయి.

మండలాలు

నియోజకవర్గంలో ఆరు మండలాలున్నాయి. కమలాపురం, సీకే దిన్నె, చెన్నూరు, పెండ్లిమర్రి, వల్లూరు, వీఎన్‌పల్లె.

2004 నుంచి ఎన్నికల సరళి

2004లో జి.వీరశివారెడ్డి టీడీపీ తరపున ఎన్నికై కాంగ్రెస్‌లోకి మారారు. కాంగ్రెస్ తరపున పోటీ చేసి ఓడిపోయిన పుత్తా నరసింహారెడ్డి టీడీపీలోకి మారారు. 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున జి.వీరశివారెడ్డి పోటీ చేసి తన సమీప ప్రత్యర్థి పుత్తా నరసింహారెడ్డిపై 4163 ఓట్ల మెజార్టీతో గెలిచారు. 2014 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి రవీంద్రనాధరెడ్డి తన సమీప టీడీపీ అభ్యర్థి పుత్తా నరసింహారెడ్డిపై 5345 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 2019లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి పి.రవీంద్రనాధరెడ్డి తన సమీప టీడీపీ అభ్యర్థి పుత్తా నరసింహారెడ్డిపై 27,333 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 2024లో వైసీపీ తరపున పి.రవీంద్రనాధరెడ్డి, టీడీపీ అభ్యర్థిగా పుత్తా చైతన్యరెడ్డి, సీపీఐ అభ్యర్థిగా గాలిచంద్ర పోటీలో ఉన్నారు.

1952 నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు

1952	నర్రెడ్డి శివరామిరెడ్డి, సీపీఐ
1955	ఎం.శంభురెడ్డి, కాంగ్రెస్
1962	వి.వెంకటరెడ్డి, కాంగ్రెస్
1967	ఎన్.పుల్లారెడ్డి , స్వతంత్ర
1972	ఆర్‌సీతారామయ్య, కాంగ్రెస్
1978	పేర్ల శివారెడ్డి, స్వతంత్ర
1983	జి.వెంకటరెడ్డి, టీడీపీ
1985	ఎంవీ మైసూరారెడ్డి, కాంగ్రెస్
1989	ఎంవీ మైసూరారెడ్డి, కాంగ్రెస్
1994	జి.వీరశివారెడ్డి, టీడీపీ
1999	ఎంవీ మైసూరా రెడ్డి, కాంగ్రెస్
2004	వీరశివారెడ్డి, టీడీపీ
2009	వీరశివారెడ్డి, కాంగ్రెస్
2014	పి.రవీంద్రనాధరెడ్డి, వైసీపీ
2019	పి.రవీంద్రనాధరెడ్డి, వైసీపీ

పోలింగ్ విషయాలు తెలుసుకోండి....

చెన్నూరు, ఏప్రిల్ 25: ఏ కారణంతోనైనా పోలింగ్ ప్రారంభం కావడం ఆలస్యమైతే పోలింగ్ సమయం పెంచరు. నిర్ణీత సమయానికి క్యూలైనులో ఉన్న వారికి ఓటు వేసేందుకు అనుమతిస్తారు. ఎంత రాత్రి అయినా సరే వారంతా ఓటు వేసే వరకు పోలింగ్ కొనసాగుతుంది.

- పోలింగ్ కేంద్రంలో కానీ, కేంద్రానికి వంద మీటర్ల పరిధిలో కానీ అభ్యర్థి, మరే వ్యక్తి కూడా ఫలానా గుర్తు, వ్యక్తికి ఓటు వేయాలని ప్రచారం చేయడం శిక్షార్హం. ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 130 ప్రకారం నేరం.
- గ్రామాలు, పోలింగ్ కేంద్రాల పరిధిలో ఏదైనా కారణాలతో ఓటింగ్ బహిష్కరిస్తే రీపోలింగ్ నిర్వహించరు.
- పోలింగ్ కేంద్రం పరిధిలో కానీ, వంద మీటర్ల దూరంలో కానీ అభ్యర్థి మీడియాతో మాట్లాడకూడదు. అది చట్టరిత్యా నేరం.
- పోలింగ్ కేంద్రంలోకి వెళ్లడానికి గన్‌మెన్‌కు అనుమతిలేదు. ఒకవేళ ఓటు వేసేందుకు గన్‌మెన్ వస్తే తన ఆయుధాన్ని బయట ఉన్న పోలీసుల వద్ద ఉంచి ఓటు వేసి తిరిగి వచ్చి తన ఆయుధాన్ని తీసుకోవాలి.
- ఓటు వేసేటపుపడు ఫొటోలు తీయడం, వీడియో చిత్రీకరణ నేరం., ఇది రహస్య ఓటింగ్‌కు భంగం కలిగిస్తుంది.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 25: 18 ఏళ్ల నిండిన ప్రతి భారతీయ పౌరుడికీ ఓటు హక్కు రాజ్యాంగం ప్రసాదించింది. ప్రతి ఓటరూ తమ హక్కును వినియోగించుకోవాలి. ఈ విషయాన్ని ఎన్నికల కమిషన్ మేధావులు, రాజకీయ పార్టీలు పదే పదే చెబుతుంటాయి. ఒక్కో నియోజకవర్గంలో చాలా మంది ఎన్నికల బరిలో ఉంటారు. అభ్యర్థులకు ఓటు వేయడం ఇష్టం లేకపోతే చివరి వరుసలో ఉన్న నోటా బటన్ నొక్కితే సరిపోతుంది. 2014 సార్వత్రిక ఎన్నికల్లో మొదటిసారిగా కేంద్ర ఎన్నికల సంఘం నోటాకు అవకాశం కల్పించింది.

ప్రచార రథాల జోష్

- ఊరూవాడా హల్‌చల్
- తెల్లవారే సరికే గ్రామాల్లో ప్రత్యక్షం
- ఎన్నికల ప్రచారంలో కీలకపాత్ర



కడప (రూరల్), ఏప్రిల్ 25: దేశంలోనే ఎన్నడూ లేనివిధంగా 2019 సుదీర్ఘ ఎన్నికల సమరానికి ఎన్నికల కమిషన్ శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ఏపీలో ఏంపీ, ఎమ్మెల్యే నాలుగో విడత ఎన్నికలకు ఏప్రిల్ 18న నోటిఫికేషన్ జారీ చేసింది. 25 వరకు నామినేషన్లు, 29 వరకు ఉపసహరణ, మే 13న పోలింగ్ జరగనుంది. 2024 ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికలు ఆయా పార్టీల భవితవ్యాన్ని నిర్ణయించేవి కావడంతో గేలుపే ధ్యేయంగా పావులు కదుపుతున్నాయి. ఇందులో గెలుపే ప్రధాన కారణాల్లో ప్రచారం ఒకటి కావడంతో పార్టీల అధినాయకులు, అభ్యర్థులు ఓటర్లను అకట్టుకునే ప్రచారానికి తెరలేపారు. ప్రచారంలో తామే ఒకడుగు ముందుండాలనే భావనతో ప్రచార అర్భాటానికి అధిక ప్రాదాన్యతను ఇస్తున్నారు. అన్ని పార్టీల అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో ఓటర్లను అకట్టుకునే విధంగా పార్టీల ప్రచార వాహనాలను అందంగా తయారు చేసి ప్రచారంలోకి దింపారు. ఉమ్మడి కడప జిల్లాలోని కడప నియోజక వర్గం సహా మైదుకూరు, పొద్దుటూరు, జమ్మలమడుగు, కమలాపురం, పులివెందుల, రాయచోటి, రైల్వేకోడూరు, రాజంపేట, బద్వేలు నియోజకవర్గాల్లో ఒక్కో పార్టీ నుంచి అధిక సంఖ్యలో సంచార వాహనాల్లో ప్రచారం చేస్తూ తమ పార్టీ గుర్తుకే ఓటువేయాలని ఓటర్లను చైతన్యపరిచే గీతాలతో హల్‌చల్ చేస్తున్నాయి. దీంతో అభ్యర్థుల ప్రచారంలో ప్రచార వాహనాలు స్పెషల్ అట్రాక్షన్‌గా నిలుస్తున్నాయి. తెల్లవారే సరికే గ్రామాల్లో ప్రచార రథాలు దర్శనమిస్తూ సుప్రభాత గీతంలా అభ్యర్థుల గురించి ఘనంగా చెప్పుతూ హోరెత్తిస్తున్నా యి. ఆయాపార్టీల రంగులు పులుముకొని, పోటీచేసే అభ్యర్థులు, అధినేత ఫొటోలు, గుర్తులతో అందంగా అలంకరించిన ప్రచార రథాలు ఊరూవాడా తిరుగుతూ ఎన్నికలకు కళ తెస్తున్నాయి. ప్రధాన పార్టీల అభ్యర్థులే కాకుండా స్వతంత్ర అభ్యర్థులు సైతం ప్రచారం రథాలతో ఎన్నికల రణ క్షేత్రంలో హోరెత్తిస్తున్నాయి. అభ్యర్థులకంటే ముందే ప్రచార రథాలు నియోజకవర్గాలను చుట్టివస్తూ ప్రచారానికి జోష్ కల్పిస్తున్నాయి. జనసంచారం ఉంటున్న కూడళ్లలో ప్రచార రథాలు ప్రజ లన ు ఉత్తేజపరిచి చైతన్యం నింపే పాటలు, అధినేత ప్రసంగాలతో హంగామా చేస్తున్నాయి. ఎన్నికలంటేనే ప్రచారం అన్నట్లుగా ఆయా ప్రచార రథాలను అన్ని పార్టీల అభ్యర్థులు, అన్ని హంగులతో తయారు చేసి క్షేత్రస్థాయిలో తిప్పుతూ గ్రామీణ రోడ్లపై పరుగులు తీయిస్తున్నారు.



• కడప నగరంలో పోటాపోటీగా

కడప నగరంలో ఎన్నడూ లేనిరీతిలో ఆయా పార్టీల అభ్యర్థులు 2024 సాధారణ ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. టీడీపీ, బీజేపీ, జనసేనలు ఎన్డీయే కూటమి గాను, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎంలు ఒక కూటమి, వైఎస్ఆర్‌సీపీ త్రికోణ ప్రచారాలను సాగిస్తున్నారు. పార్టీల అభ్యర్థులు ప్రచార వాహనాలను ఆయా పార్టీల గుర్తులు, రంగులతో అందంగా అలంకరించి ప్రచారంలోకి దించారు. ఒక్కో పార్టీనుంచి ఐదారు వాహనాలదాకా ప్రచారంలోకి దిగడంతో ఏ కాలనీలో, ఏ వీధిలో చూసినా ప్రచార వాహనాల మోతే మార్మోగుతోంది. ఫలానా పార్టీ అభ్యర్థికి మీ అమూల్యమైన ఓట్లువేసి, వేయించి గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నాం అంటూ మైకు ద్వారా ఓటర్ల చెవుల్లో గింగుర్లు తిరిగేలా చేస్తున్నారు.

• పొద్దుపొద్దున్నే గ్రామాల్లో

ఎన్నికల ప్రచార ముగింపు గడువు రోజురోజుకూ సమీపిస్తుండడంతో ప్రచారంలో కూడా అభ్యర్థులు కాస్త వేగం పెంచారు. గ్రామీణ ఓటర్లు నిద్రలేచి లేవంగానే పార్టీల పరచార రథాలు గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యక్షమవుతూ ప్రచార వాణిని వినిపిస్తున్నాయి. గ్రామాల్లో తిరుగుతూ ప్రచార రథాలు అకట్టుకుంటున్నాయి. అన్నిహంగులతో రూపొందించిన ఈ ప్రచార రథంలో కార్యకర్తలు లేకున్నా వాటిలో మైక్ సెట్లను ఏర్పాటుచేసి గ్రామాల్లోకి పంపిస్తున్నారు. ఇప్పటికే ప్రచార రథాలు అన్ని గ్రామాల్లోని వీధివీధినా ఒటికి రెండు సార్లు చుట్టేసి అభ్యర్థుల తరపున ప్రచారం చేస్తున్నాయి. అభ్యర్థులు ప్రచారానికి వెళ్లే గ్రామాల్లో అరగంట ముందే అక్కడికి ప్రచార రథాలు వెళ్లి జోష్ తెప్పిస్తున్నాయి. ప్రచార రథం ఉత్తేజ పరిచే పాటలతో జనాన్నికూడగడుతున్నా యి. త ద న ం తరం అభ్యర్థి అక్కడికి వెళ్లి తమ ప్రచారాన్ని నిర్వహించి రక్తికట్టిస్తున్నారు. మొత్తానికి అభ్యర్థుల ప్రచార రథాలు ప్రచారంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని చెప్పవచ్చు



అభ్యర్థుల ఫొటోలతో ముస్తాబు

ప్రచార రథాలను పార్టీల రంగులతో అభ్యర్థుల ఫొటోలతో అందంగా ముస్తాబు చేశారు. రంగంలో ఉంటున్న పార్టీల అభ్యర్థులు ముందస్తుగానే వేలాది రూపాయలు వెచ్చించి ఈ ప్రచార రథాలను తయారు చేయించారు. వాహనాలకు అభ్యర్థుల కటౌట్‌లను ఏర్పాటుచేసి దానికే మైక్ సెట్లను అమర్చి ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆయా పార్టీ అభ్యర్థులు తమ పార్టీ గర్తులను, రంగులను వేయించి వినూత్నంగా ప్రచార రథాన్ని తయారు చేసి ఎన్నికల క్షేత్రంలోకి వదిలారు.

ఓట్లులేకున్నా... రాయ'బేరాలు'

బిల్డప్ నేతల మాటలు • లక్షలు ఇస్తే వస్తామంటూ రాయబారాలు



చెన్నూరు, ఏప్రిల్ 25: చెన్నూరు మండలం టీడీపీకి కంచుకోట. ఆది నుంచీ ఈ పార్టీకి కింది స్థాయిలో మంచి ఓటు బ్యాంకు ఉంది. ఇటీవల చిన్నపాటి ఇబ్బందులతో ప్రజలు కాసింత దూరమైనా ఇప్పుడు తిరిగి సైకిలు ఎక్కుతున్నారు. సైకిలు జోరు హుషారుగా ఉన్న ఈ సమయంలో ఎలాగైనా ఆ పార్టీ ద్వారా క్యాష్ చేసుకోవాలని కొందరు నేతలు ప్రయత్నిస్తున్నారు. అదే సమయంలో అధికార పార్టీ నేతల వద్ద సైతం తమకు ఓట్లు మస్తుగా ఉన్నాయి. మీ పార్టీలోకి వస్తే ఏం ఇస్తావు అంటూ రాయబేరాలు సాగిస్తున్నారు. ఇటు ఇరుపార్టీల వద్ద ఇదే విధంగా స్థానిక నేతలు కొందరు నెరుపుతున్నారు. మేం నియోజకవర్గ స్థాయిలో మా సత్తా చాటాం. జిల్లాస్థాయిలో పదవులు అనుభవిం చి మా సత్తా చాటాం. మా కులం, మా బంధువర్గం, నా అనుచర వర్గం కొండవీటి చాంతాండంత ఉంది. కాబట్టి మీ పార్టీకి సపోర్టు చేయాలంటే మాకు లక్షల్లో ఆదాయం చూపితే వస్తం అంటూ మధ్యవర్తులతో రాయాబేరాలు సాగిస్తున్నారు. అయితే ఇలా రాయబారాలు సాగించే పలువురు నేతలకు ఓటింగ్ మాత్రం అత్యంత తక్కువగా ఉన్నాయి. పైకి మాత్రం గతంలో పదవులు అనుభవించిన స్థాయి, వెనుక తిరిగే అనుయాయులను చూపుతూ బేరాలు సాగిస్తున్నారు. 'మా తాతలు నేతులు తాగారు, మా మూతులు వాసన చూడండి' అన్న విధంగా కొందరు నేతల ప్రవర్తన ఉంటోంది. ప్రజల్లో మాత్రం ఆ నేతకు జీరో అని చెప్పుకుంటున్నా గతంలో వారు ఉన్న పదవులు (ప్రస్తుతం మాజీలే) చూపిస్తూ మేం వస్తే మీ పార్టీకి లాభమని చెప్పుకుంటున్నారు. ప్రధాన పార్టీల నేతలు మాత్రం నమ్మడం లేదు. వీరు ఉన్న ప్రాంతంలోనే వీరు అనుచరవర్గం చెబుతున్నారో వారికి ఇస్తే మాకు మరిన్ని ఓట్లు వస్తాయి కదా అనివీరికి ఇవ్వ డం ఎందుకని ఓ వైపు ఆలోచన చేస్తున్నారు. మరో వైపు మాత్రం నీతో పాటు నీ అనచర వర్గం బంధువర్గం మొత్తం రావాల్సిందే. నీవు ఒక్కడివి సరిపోదు అంటూ ప్రధాన పార్టీల నేతలు చెబుతున్నారు. ఇలా చెన్నూరులో రోజూ ఒక నాయకుడి విషయం బయటికి పొక్కడం మా సత్తా ఇంత ఉంది అని చెప్పుకోవడం జరుగుతుంటే స్థానికులు మాత్రం ఈ బిల్డప్‌లకు ఏమీ కొదవలేదు. అసలు వీరికి ఓట్లు ఉన్నాయా ఇప్పుడు డబ్బు ఇస్తే అసలు ఓటుకు వస్తారా లేదా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. మొత్తమ్మీద బిల్డప్ నేతల మాటలు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఏ మేరకు నమ్ముతారో వారికి లక్షలు ముట్టచెబుతారా, లక్షణంగా పక్కనబెడతారా అన్నది మరో వారంలో తేలిపోనుంది. ఈ లోగా నేతలు తమ అనుచరవర్గాన్ని వారున్న ప్రాంతంలోనే విస్తృత ప్రచారం గాలిస్తూ మరింత ఓటింగ్‌శాతం పెంచుకోవడం ప్రత్యేకంగా చెప్పుకోవచ్చు. అందులో టీడీపీ మరింత ముందుజంలో ఉందని చెప్పకనే చెబుతుంది.

అఫ్జల్ ఖాన్ నామినేషన్

కడప(కలెక్టరేట్), ఏప్రిల్ 25: కడప అసెంబ్లీ నియోజక వర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా అఫ్జల్ ఖాన్ గురువారం నామినేషన్ వేశారు. నగర అధ్యక్షుడు విష్ణు ప్రీతం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా టీడీపీ అభ్యర్థి పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి నామినేషన్

● వేలాదిగా తరలివచ్చిన అభిమానులు ● క్రాస్‌రోడ్డు నుంచి ఎమ్మార్వో కార్యాలయం వరకు భారీ ర్యాలీ



కమలాపురంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న జన సందోహం

కమలాపురం రూరల్, ఏప్రిల్ 25 : టీడీపీ అ భ్యర్థిగా పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి గురువారం అ శేష జన సమూహం మధ్య నామినేషన్ దా ఖలు చేశారు. కమలాపురం క్రాస్ రోడ్డు నుం చి టీడీపీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహిం చి అనంతరం ఆర్వో కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేసి రిటర్నింగ్ అధికారి గణేశ్‌కుమార్‌కు అందించారు. ఈ సందర్భంగా ము ఖ్యఅతిథిగా పాల్గొన్న నరసింహారెడ్డి మాట్లాడుతూ కమలాపురం అభ్యర్థిగా యువకుడు, ఉత్సాహవంతుడు పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి నా మినేషన్ వేశారన్నారు. టీడీపీ అధిష్టానం యువతకు పెద్ద పీట వేసిందన్నారు. ఈ క్ర మంలోనే టికెట్ కడప పార్లమెంటు అభ్యర్థిగా భూపేష్‌రెడ్డిని, కమలాపురం శాసనసభ అభ్యర్థిగా క్రిష్ణచైతన్యరెడ్డికి ఇ చ్చారన్నారు. వారిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఇప్పటికే వైసీపీ ప్రభుత్వాన్ని కూలదోయాలని ఆంధ్ర ప్రజలు కంకణం కట్టుకున్నారన్నారు. అ సెంబ్లీ అభ్యర్థి పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి మాట్లాడుతూ నామినేషన్ పర్వానికి వేలాదిగా తరలివచ్చిన అభిమానులకు, నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. ఎట్టకేలకు టీ డీపీ శాసనసభ అభ్యర్థిగా నామినేసన్ దాఖలు చేసిన పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి యుద్ధం ఇప్పుడే మొదలైందన్నారు.నా విజయానికి మీ అందరి సహకారం కావాలన్నారు. ప్రతి ఒక్క కార్యకర్త నాయకుడు ఒక సైనికుడుగా పనిచేయాలన్నా రు. బీజేపీ, జనసేన నేతలు, కార్యకర్తలు అం తా ఏకతాటిపైకి వచ్చారు. భూపేష్‌రెడ్డి మా ట్లాడుతూ క్రిష్ణచైతన్యరెడ్డి నామినేషన్ గ్రాండ్ సక్సెస్ అయిందన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో టీడీపీ మేనిఫెస్టో ప్రజల్లోకితీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. పార్లమెంటు అభ్యర్థిగా భూ పేష్ రెడ్డి అను నన్ను, కమలాపురం శాసనసభ అభ్యర్థిగా క్రిష్ణచైతన్యరెడ్డిని అత్యధిక మె జార్టీతో గెలిపించండి అని విన్నవించారు. ఈ కా ర్యక్రమంలో డాక్టర్ క్రిష్ణకిశోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే టీడీపీ నినాదం

వల్లూరు, ఏప్రిల్ 25 : యావత్ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందాలంటే అది టీడీపీ పార్టీ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకే సాధ్యమని కమలాపురం నియోజకరవ్గ ఇన్‌చార్జ్ పుత్తా నరసింహారెడ్డి సోదరుడి కుమారుడు సాయినరసింహారెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని తోళ్లగంగనపల్లె గ్రామ పంచాయతీలో మీ భవిష్యత్తుకు మేం గ్యారంటీ ప్రచారం ని ర్వహించారు. బడుగు బలహీన వర్గాల కోసం, వారి సంక్షేమం కోసం గతంలో టీడీపీ ప్రభు త్వం ఎన్నో ప్రవేశపెట్టిందని గుర్తు చేశారు. దోచుకున్న వారికికే దోచుకున్నంత అని ఈ వైసీపీ ప్రభుత్వం పనితీరు ఉందన్నారు. వీటికి చరమగీతం పాడాలంటే టీడీపీని అఖండమెజార్టీతో గెలిపించాలని కోరారు. టీడీపీ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి, రా మసుబ్బారెడ్డి, చంద్రా రెడ్డి, శివకేశవరెడ్డి, లక్ష్మరెడ్డి, గురయ్య, సుధకర్‌రెడ్డి, రవీంద్రనాధరెడ్డి, సద్దాం, దస్తగిరి, మైనార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

పుత్తా నరసింహారెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో 150 కుటుంబాలు చేరిక



కమలాపురం రూరల్, ఏప్రిల్ 25:నగర పంచాయతీ పరిధిలోని అప్పాయపల్లె గ్రామానికి చెందిన కొరపాటి రవీంద్ర ప్రసాద్, బూసుపాటి ఉదయ్‌కిరణ్ ఆధ్వర్యంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి సమక్షంలో 150 కుటుంబాలు టీడీపీలో చేరారు. వారందరికీ పార్టీకండువా వేసి టీడీపీలో ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశం లో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రజలను మోసగించిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. అనంతరం టీడీపీ మేనిఫెస్టోలోని పథకాలును వివరించారు. టీడీపీ గెలిస్తేనే మీకందరికీ సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ఏ అవసరం వచ్చినా అర్ధరాత్రి సమయమైనా నాకు ఫోను చేస్తే మీ వద్దకు వస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాగరాజు ప్రణ య్, శివలింగం శివ, భూషణం, చిన్నయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 25 : కడప రైల్వేస్టేషన్‌లో రూ.25 కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని గుంతకల్లు డీఆర్ఎం వినీత్‌సింగ్ పేర్కొన్నారు. గురువారం కడప రైలు నిలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. 2వ ప్లాట్‌ఫాంలో జరుగుతున్న షల్టర్ పనులు, ప్లాట్‌ఫాం విస్తరణ, పార్కింగ్ పనులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం సూచనలు ఇచ్చారు. సీనియర్ డీఈఎన్ అక్కిరెడ్డి, సీనియర్ డీసీఎం మనోజ్, సీనియర్ డీవోఎం శ్రావణకుమార్, సీనియర్ డీఈ వీరయ్య, చీఫ్ ప్రాజెక్టు మేనేజరు బీఆర్ క్రిష్ణ, కడప రైల్వేస్టేషన్ మేనేజరు శేఖర్‌కుమార్, సీనియర్ కమర్షియల్ ఇన్స్‌పెక్టరు ఎ.జనార్ధన్, ఏడీఈఎన్ రాధాక్రిష్ణ, ఐపీఎఫ్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలి

కడప(కలెక్టరేట్), ఏప్రిల్ 25: ప్రతి ఉద్యోగి పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలని జిల్లా జేఏసీ ఛైర్మన్ శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 12న పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి ఫారం-12ని జమ చేయడానికి చివరి రోజు కాబట్టి సిబ్బంది ఆయా నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులకు జమ చేయాలన్నారు.

జీపు ఢీకొని టీడీపీ కార్యకర్త మృతి



మృతిచెందిన భాస్కర్‌రెడ్డి

చక్రాయపేట, ఏప్రిల్ 25: నారపురెడ్డిగారిపల్లెకు చెందిన టీడీపీ కార్యకర్త పెద్దమావిరెడ్డిగారి భాస్కర్‌రెడ్డి గురువారం జీపు ఢీకొని మృతిచెందారు. భాస్కర్‌రెడ్డి కుటుంబ సభ్యుల కథనం మేరకు.. భాస్కర్‌రెడ్డి చక్రాయపేటలో బీటెక్ రవి ప్రచారంలో పాల్గొని నాగులగుట్టపల్లెకు బైకుపై వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కుటుంబ సభ్యులు శోకసముద్రంలో ము నిగిపోయారు.

'కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి'

కడప(కలెక్టరేట్), ఏప్రిల్ 25: సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులను గెలిపించాలని ఏఐసీసీ ఆంధ్రప్రదేశ్ ఎన్నికల పరిశీలకుడు శంకర్ విశ్వనాథన్, రాజ్యసభ మాజీ సభ్యుడు తులసిరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు.

'చంద్రబాబు సీఎం రావాలి'

చక్రాయపేట, ఏప్రిల్ 25: మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని పులివెందుల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీటెక్ రవి పేర్కొన్నారు. ఆవులవాండ్లపల్లె, ఆంజనేయపురం, ఉప్పలవాండ్లపల్లె, పాతహరిజనవాడ, కొత్త హరిజనవాడ, ఇసుకచింతలపల్లె, తిమ్మారెడ్డిగారిపల్లె, యార్లవాండ్లపల్లె తదితర గ్రామాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల కోసం చంద్రబాబునాయుడు గతంలో డ్వాక్రా సంఘాలను ప్రవేశపెట్టారని, ప్రస్తుతం కూడా ఉచిత బస్సు ప్రయాణం, ఉచితంగా మూడు సిలిండర్లు అందజేస్తారని పేర్కొన్నారు.

భర్త వేధింపులు తాళలేక ఆత్మహత్య

కడప (క్రైం), ఏప్రిల్ 25 :కట్టుకున్నవాడే వేధించడం, వివాహేతర సంబంధాలు కొనసాగిస్తుండటంతో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. రిమ్స్ ఎస్ఐ నారాయణ వివరాల మేరకు.. కడప సాగర్ కాలనీకి చెందిన వడ్డే సాయి ఒంటిమిట్ట సచివాలయంలో సర్వేయరుగా పనిచేస్తున్నాడు. పత్తికొండకుచెందిన లతికతో రెండున్నర సంవత్సరాల క్రితం వివాహమైంది. భార్యభర్తలు సాగర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. ఈ నేపథ్యంలో సాయి మరో మహిళతో వివాహేతర సంబంధం పె ట్టుకున్నాడు. ఈ విషయంపై భార్య లతిక పలుమార్లు నిలదీసినప్పటికీ అతనిలో మార్పు రాలేదు. పెద్దల సమక్షంలో పంచాయతీ జరిగినా ఫలితం లేదు. దీంతో ఆమె గురువారం ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సాయిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

అరటి తోట దగ్ధం



సీకేదిన్నె, ఏప్రిల్ 25: చింతకొమ్మదిన్నె మండలం బొగ్గుల పల్లె పంచాయతీ నాగిరెడ్డిపల్లెలో అరటి తోట దగ్ధమైంది. బుధవారం మధ్యాహ్నం సమయంలో ఉన్నట్టుండి అరటి తోటకు నిప్పంటుకుంది. అగ్నిమాపక సిబ్బంది రంగ ప్రవేశం చేసి మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే దాదాపు నాలుగు ఎకరాల్లో అరటితోట దగ్ధమైంది. దాదాపు రూ.8 లక్షల వరకు నష్టం వాటిల్లి ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు విన్నవించారు.

రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు మృతి



గంగిరెడ్డి (ఫైల్)

సీకేదిన్నె, ఏప్రిల్ 25:రిటైర్డు ప్ర ధా నో పా ధ్యా యుడు ఎన్‌సీ గంగిరెడ్డి బుధవారం రాత్రి మృతిచెందినట్లు వారి కు టుంబ సభ్యులు తెలిపారు. ఈయన చింతకొమ్మదిన్నె మండలం బయనపల్లె శ్రీవెంకటేశ్వర ఎయిడెడ్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా దాదాపు 34 సంవత్సరాలు విధులు నిర్వహించి పదవీ విరమణ చేశారన్నారు. ఈయన శిష్యులు దేశ, విదేశాల్లో వివిధస్థాయిలో పనిచేస్తున్నారు. గురువారం ఆయన అంత్యక్రియలు నిర్వహించారు.

టీడీపీ బీసీ సెల్ నగర ఉపాధ్యక్షుడిగా రాఘవేంద్ర

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 25 : టీడీపీ బీసీ సెల్ నగర ఉపాధ్యక్షుడిగా గోదిన సుజన్ రాఘవేంద్రను నియమిస్తూ టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి ఉత్తర్వులు విడుదల చేశారు. గురువారం ఆయనకు నియామకపత్రాలను అందించారు. కార్యక్రమంలోటీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే టీడీపీ లక్ష్యం

● టీడీపీ కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి



ఇంటింటి ప్రచారంలో మాధవీరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 25 : పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా టీడీపీ కొనసాగుతుందని కడప ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్.మాధవీరెడ్డి అన్నారు. గురువారం కడప నగరం 21, 50వ డివిజన్లలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ కరపత్రాలు అందించారు. అలాగే చంద్రబాబు అమలు చేయనున్న సూపర్‌సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక చేపట్టబోయే సంక్షేమం అభివృద్ధి సంబంధించి ప్రజలకు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లాలో అరాచక పాలన సాగుతుందన్నారు. ప్రజలు వైసీపీ పాలనతో విసిగి వేసారని తెలిపారు. ప్రజలు టీడీపీ వైపు చూస్తున్నారన్నారు. త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో సైకిలు గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపిచాలన్నారు. చంద్రబాబును సీఎం చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడపించాలని కోరారు. రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధనరెడ్డి, బాబు, శివశంకర్‌రెడ్డి, చక్రధర్, చంద్ర, రాజా, నవీన్ అత్యధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

రామాలయాల్లో ప్రత్యేక పూజలు

కడప నగరం చిన్నచౌకు, మోడమీదపల్లె, శంకరాపురం, ఎర్రముక్కపల్లె, ముత్తరాసుపల్లెలో ఉన్న రామాలయాల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించాలని ఆ కోదండరామయ్యను కోరినట్లు తెలిపారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలోటీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 'నారాయణ' హవా



విద్యార్థులను అభినందిస్తున్న నారాయణ కళాశాల యాజమాన్యం

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 25 : జేఈఈ మె యిన్స్ ఫలితాల్లో కడప నారాయణ కళాశాల విద్యార్థులు హవా కొనసాగించారని కళాశాల ప్రిన్సిపాల్ మురళీమోహన్, వెంకటస్వామి, రాఘవరెడ్డి, సుధాకర్‌రెడ్డి తెలిపారు. చైతన్యక్రిష్ణ ఆలిండియా స్థాయిలో 360 ర్యాంకు సాధించారన్నారు. అలాగే ఎం. హాసిని 1169వ ర్యాంకు, హితేష్‌రెడ్డి 1735 ర్యాంకు, ఆర్.నిఖిల్ 2012, ఎస్. అహ్మద్ అజిత్ 2204, కె.మేఘనారెడ్డి 2500, వై.వినయ్‌రెడ్డి 3320, బింద్ర 3663, సాయివైష్ణవి 4327, లక్ష్మిసాయి హాసిని 4787, జాగృతి 13425. నీరజ్ శబరి 14761, సాయిరుషికేశ్ 15426, నిఖిల సంధ్య 18396, రోహిత్‌రెడ్డి 45261 ర్యాంకు సాధించారన్నారు. 150 మందికి పైగా వబిద్యార్థులు జేఈఈ అడ్వాన్సు ఫలితాల్లో అర్హత పొం దారని తెలిపారు. విద్యార్థులను అ లాగే అధ్యాపక బృందానికి రామ్మోహన్‌రెడ్డి, కోడీన్ చంద్రకిశోర్‌రెడ్డి, ఏ జీయం చెన్నక్షిరెడ్డి, వెంకటరామిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కేశవరెడ్డిలు అభినందించారు.

ప్రాంగణ ఎంపికల్లో కేఎస్ఆర్ఎం విద్యార్థుల హవా



ఎంపికైన విద్యార్థులతో అధ్యాపక సిబ్బంది

సీకేదిన్నె, ఏప్రిల్ 25: ప్రాంగణ ఎంపికల్లో కేఎస్ఆర్ఎం మేనేజ్‌మెంట్ స్టడీస్ కేఎల్ఎం మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థిని తమ ప్రతిభ చాటి ప్రముఖ బహుళజాతీయ సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో సత్తా చాటినట్లు కళాశాల కరస్పాండెంట్ రాజేశ్వరమ్మ తెలిపారు. స్థానిక కేఎస్ఆర్ఎం కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో కేఎస్ఆర్ఎం మేనేజ్‌మెంట్ స్టడీ నుంచి ఆరుగురు, కేఎల్ఎం కళాశాల నుండి ముగ్గురు ఎంపికయ్యారని కంపెనీ హెచ్ఆర్ దేవప్రసాద్ వారికి ఎంబీఏ ఉత్తీర్ణత అయిన వెంటనే మే నెలలో కంపెనీలో రిపోర్టు చేయాలని, వార్షిక వేతనం రూ.4 లక్షలు మొదట్లో అందించడం జరుగుతుందన్నారు. ప్రాంగణ ఎంపికల్లో ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాళ్లు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు. వైస్‌ఛైర్మన్ మదన్‌మోహన్‌రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ చంద్ర ఓబుళరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ కిరణ్‌కుమార్ అభినందించారు. ప్రిన్సిపల్స్ డాక్టర్ నాగమణి, రత్నమ్మ పాల్గొన్నారు.

జగన్.. ప్రజలకు మైకు ఇచ్చిచూడు : దస్తగిరి

పులివెందుల, ఏప్రిల్ 25: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుకు సంబంధించి పులివెందుల ప్రజలకు ఏమైనా డౌట్లు ఉన్నాయా అని ప్రజల చేతికి మైకు ఇచ్చి అడిగితే సీఎం జగన్‌కు తెలుస్తుందని వివేకా హత్య కేసులో అప్రూవర్ దస్తగిరి పేర్కొన్నారు. గురువారం జై భీమ్ భారత్ పార్టీ తరఫున పులివెందుల అసెంబ్లీకి దస్తగిరి నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్ వివేకా హత్య కేసులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఏవేవో మాట్లాడుతున్నారన్నారు. మీరొక్కరు మైకు తీసుకొని మాట్లాడితే పులివెందుల ప్రజల డౌట్లు ఎలా తీరుతాయన్నారు. మరో మైకు పులివెందుల ప్రజల చేతికిచ్చి వివేకా హత్య కేసులో ఎవరికైనా డౌట్లు ఉన్నాయా అని అడిగితే అపుడు చెబుతారన్నారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అప్రూవర్‌గా ఉండొద్దని వారివైపు రావాలని కోట్ల రూపాయలు ఆశచూపారన్నారు. జైలు లోపల ఉన్నప్పుడు, బయట ఉన్నప్పుడు కూడా ప్రలోభపెట్టాలని చూశారు. చివరకు జై భీం పార్టీ తరఫున తాను నామినేషన్ వేయకుండా రూ.5కోట్లు ఆఫర్ చేశారన్నారు. తాను పోటీ చేస్తే ఇబ్బందని జగన్ అనుచరులు తనతో మాట్లాడాలని చూస్తున్నారని, వాటిని పట్టించుకోకుండా పులివెందుల ప్రజలను నమ్మి నామినేషన్ దాఖలు చేశాని, ఆశీర్వదించి కోటు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి

అట్లూరు, ఏప్రిల్ 25 : అట్లూరు మండలంలోని అట్లూరు, తంబళ్లగొంది, మాదాపూర్, మణ్యం వారిపల్లె, కామసముద్రం, ముత్తుకూరు గ్రామాల్లో బద్వేలు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్.డీ విజయజ్యోతి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జకరయ్య, సుధాకర్‌రెడ్డి, పగడాల నరసింహులు పాల్గొన్నారు.

అస్వస్థతకు గురై ఉపాధి కూలి మృతి

మైదుకూరు, ఏప్రిల్ 25 : ఉపాధి పథకం కింద పనులు చేస్తున్న కూలి మృతి చెందిన ఘటన గురువారం మండలంలోని గంజికుంటలో జరిగింది. లెక్కలవారి పల్లెకు చెందిన గవ్వల పెద్ద బాలుడు (63) గ్రామీణ ఉపాధి పథకం కింద పనులకు వెళ్లేవారు. ఈ క్రమంలో గంజికుంట సమీపంలో నిర్వహిస్తున్న పనులు చేస్తూ అక్కడే కుప్పకూలిపోయాడు. అతన్ని పరిశీలించగా మృతి చెందినట్లు గమనించిన తోటి కూలీలు అధికారులకు తెలియచేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



ఎర్రగుంట్ల, ఏప్రిల్ 25: ఎర్రగుంట్ల మండలంలోని పోట్లదుర్తి నాలుగురోడ్ల కూడలిలో ఉన్న బస్‌షెల్టర్‌లో గురువారం గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. గత మూడురోజులుగా ఇతను ఇదే షెల్టర్‌లో అనారోగ్యంతో పడివున్నాడు. స్థానికులు అతన్ని ఆసుపత్రికి పంపే ప్రయత్నం చేసినా సహకరించలేదన్నారు. అయితే అతని వద్ద ఎలాంటి వివరాలు లేకపోవడంతో చిరునామా తెలుసుకోలేకపోయామని పేర్కొంటున్నారు. మృతిచెందిన వ్యక్తికి సుమారు 50సంవత్సరాలుంటాయన్నారు. మృతిచెందిన సమాచారాన్ని పోలీసులకు, రెవెన్యూ అధికారులకు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

ముగిసిన నామినేషన్ల పర్వం

ప్రొద్దుటూరు .ఏప్రిల్ 25 : సార్వత్రిక ఎన్నికలలో భాగంగా జరిగిన నామినేషన్ల దాఖలు ప్రక్రాయ గురువారంతో ముగిసింది. వారంరోజులుగా ఎటువంటి అవాంఛ నీయ ఘటనలకు తావులేకుండా నామినేషన్ల ఘట్టం ప్రశాంతంగా ముగిసింది. ప్రొద్దుటూరు అసెంబ్లీస్థానానికి నామినేషన్లు 18 తేదినుంచి మొదలయ్యాయి. నామినేషన్లు ముగిసే రోజు గురువారం ఒక్కరోజే 23 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగా అధికారి కౌసర్‌బాను తెలిపారు. ఈరోజు నామినేషన్లు దాఖలుచేసినవారిలో ఈవీ సురేష్‌బాబు (జాతీయ చేతివృత్తులు ఐక్యవేదిక,), పాతకోట బంగారు మునిరెడ్డి (ఆల్‌ఇండియా ఫార్వార్డ్ బిఎల్‌ఓసి),నంద్యాల వరదరాజులరెడ్డి (తెలుగుదేశం) నంద్యాల కొండారెడ్డి (తెలుగుదేశం) చింతకుంట విజయలక్ష్మి (స్వతంత్ర) నంద్యాల వరదరాజులరెడ్డి (తెలుగుదేశం), పిచ్చేళ్ళ సుబ్బరాయుడు(బహుజన సమాజ్‌పార్టీ) గుండ్లదుర్తి సీతారామిరెడ్డి(జైమహాభారత్‌పార్టీ), సురబోయిన పుల్లయ్య (రెవిల్యూషనరీ సోషలిస్టు పార్టీ), గోర్ల వెంకటసుబ్బయ్య(ఆంధ్రరాష్ట్ర ప్రజా సమితి పార్టీ), నంద్యాల లక్ష్మీ వరదారెడ్డి (జన సహాయక శక్తి పార్టీ), రాచమల్లు శ్రీనివాసులరెడ్డి (బ్లూఇండియా పార్టీ), పఠాన్ మొహమ్మద్‌రఫీ (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌పార్టీ), పోగాకు హనుమంతరెడ్డి(పిరమిడ్ పార్టీఆఫ్ ఇండియాపార్టీ), అనిల్ ప్రాష్టం (రాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా అంబేద్కరిస్టు పార్టీ) శిలిగిరి ఇర్ఫాన్ బాషా (ఇండియన నేషనల్ కాంగ్రెస్ పార్టీ)శిలిగిరి ఇర్ఫాన్ బాషా (స్వతంత్ర), షేక్ మహ్మద్ పూల నజీర్ (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌పార్టీ), షేక్‌పూల పర్వీన్‌బాను (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ), తీట్ల రవికుమార్(స్వతంత్ర), ఉండేల సాంబశివారెడ్డి (స్వతంత్ర), గోకుల ఏసన్న (స్వతంత్ర), షేక్ జబీన్ (స్వతంత్ర), అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. కాగా 18తేదినుంచి 25 తేదీ వరకు మొత్తం 45 నామినేషన్లు రాగా అందులో 11 మంది డబుల్, ట్రిపుల్ నామినేషన్ దాఖలు చేశారు.కాగా మొత్తం 34 మంది అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసినట్లు ఆర్వో కౌసర్‌బాను తెలిపారు. 26 నామినేషన్ల పరిశీలన 27 నామినేషన్ల ఉపసంహరణ జరుగుతుందన్నారు.



జమ్మలమడుగులో నామినేషన్ వేస్తున్న ఆదినారాయణరెడ్డి

ఆర్భాటంలేకుండా వరద నామినేషన్..: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి గురువారం నామినేషన్ కార్యక్రమానికి ఎలాంటి ఆర్భాటం హంగులు లేకుండా తహసీల్దారుకార్యాలయానికి వెళ్ళారు. కార్యకర్తలతో ఊరేగింపులు తీయకుండా బాణా సంచాలు పేల్చకుండా నామినేషన్ దాఖలు కార్యక్రమానికి వచ్చారు. ఎన్నికల ప్రవర్తనావళి నిబంధనలమేరకు ఆయన వెంట నలుగురు మాత్రమే ఆర్వో కార్యాలయానికి వెళ్ళి నామినేషన్ దాఖలు చేశారు.

జమ్మలమడుగు..: జమ్మలమడుగు నియోజకవర్గానికి గురువారం 15 నామినేషన్లు వేసినట్లు రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు తెలిపారు. నామినేషన్ వేసినవారు కాంగ్రెస్ తరుపున పాముల ఈశ్వర్‌రెడ్డి వేశారు. బీజేపీ తరుపున చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి నాలుగో సెట్ నామినేషన్ వేశారు. వైసీపీ తరుపున డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి మరో కసెట్ నామినేషన్ వేశారు. పల్లేటి చంద్రశేఖర్‌రెడ్డి జైభీం రావ్ భారత్‌పార్టీ తరుపున నామినేషన్ వేశారు. చదిపిరాళ్ల శివనారాయణరెడ్డి,తిమ్మారెడ్డి వెంకటసుబ్బారెడ్డి స్వతంత్ర అభ్యర్థులుగా, చింతల ఏసయ్య భరోసా పార్టీ తరుపున నామినేషన్ వేశారు. సింగం శివమోహన్‌రెడ్డి కాంగ్రెస్ తరుపున స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. అల్లె ప్రభావతి, చదిపిరాళ్ల రాజేష్‌రెడ్డి, పట్నం శివయ్య , లోటా ఖాజాహుస్సేన్ , రామాజిఇమ్మానుయేల్, చక్రపాణి స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేశారు. ఈ సందర్భంగా జమ్మలమడుగులో డీఎస్పీ యశ్వంత్ పర్యవేక్షణలో గట్టి బందోబస్తు నిర్వహించారు.

మైదుకూరు..: మైదుకూరు నియోజకవర్గం నుంచి శాసనసభ ఎన్నికలకు గాను 28 మంది అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేశారు. గురువారం నాటితో నామినేషన్ల పర్వం ముగిసింది. ప్రధాన పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులుగా మొత్తం 28 మంది 41 సెట్లను నామినేషన్లను దాఖలు చేశారు. టీడీపీ అభ్యర్థిగా పుట్టా సుధాకర్‌యాదవ్ 3 సెట్లు, ఆయన కుమారుడు పుట్టా రవికుమార్ యాదవ్ 2 సెట్లు, వైసీపీ అభ్యర్థిగా శెట్టిపల్లె రఘురామిరెడ్డి 3 సెట్లు, ఆయన కుమారులు శెట్టిపల్లె అశోక్‌రెడ్డి 2 సెట్లు , కాంగ్రెస్ అభ్యర్థిగా గుండ్లకుంట శ్రీరాములు 3 సెట్లు దాఖలు నామినేషన్లు దాఖలు చేశారు. కాగా స్వతంత్ర అభ్యర్థులుగా జిల్లా రైతు సేవాసమితి అధ్యక్షుడు ఏవీ రమణ, అన్నా వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి యస్ రాజేశ్వరరెడ్డి 3 సెట్లు ఇతరులు తమ నామినేషన్లను దాఖలు చేశారు.

బద్వేలు రూరల్..: బద్వేలు అసెంబ్లీ అభ్యర్థులుగా 28 మంది చివరి రోజు నాటికి నామినేషన్లు దాఖలు చేశారు. ప్రధాన పార్టీలతో పాటు వివిధ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ చివరి రోజైన గురువారం నాటికి 38 నామినేషన్లు దాఖలయ్యాయి. స్క్రూట్నీ, విత్‌డ్రాలు 29 నాటికి ముగుస్తాయి.

వైభవోపేతంగా రథోత్సవం



బద్వేలుటౌన్,ఏప్రిల్ 25 : ఆదిచెన్నకేశవస్వామి వారోత్సవాల్లో భాగంగా గురువారం మున్సిపాలిటీ పరిధిలోని చెన్నంపల్లె గ్రామంలో ఉన్న ఆదిచెన్నకేశవస్వామి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. టీడీపీ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టీడీపీ యువనేత రితేష్‌కుమార్‌రెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథానికి ప్రత్యేకపూజలు నిర్వహించి రథోత్సవం నిర్వహించారు. రథాన్ని అధిరోహించి సతీసమేతంగా స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలు పొందిన ఎద్దులకు ప్రథమబహుమతి 40,116, ద్వితీయబహుమతి రూ.20,116, తృతీయబహుమతి రూ.10,116 అందజేశారు. వచ్చినభక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

'కనికరం లేని కనకరాజు జగన్'



జమ్మలమడుగులో ఆది, భూపేశ్ రోడ్‌షోలో జనవాహిని

జమ్మలమడుగు, ఏప్రిల్ 25: రాష్ట్రంలో ఎక్కడా అభివృద్ధి చేయకుండా సూపర్ మార్కెట్లు తెరచి దోచుకుని నేలమాళిగలు నింపుకున్న కనికరం లేని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అంటూ ధర్మవరం ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్, జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డి, కడప పార్లమెంటు అభ్యర్థి భూపేశ్‌రెడ్డి విమర్శించారు. గురువారం జమ్మలమడుగు అసెంబ్లీ నియోజకవర్గానికి ఎన్డీయే కూటమి అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసి అక్కడి నుంచి మార్కెట్‌రోడ్డులో గంగమ్మ దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు చేసి రోడ్‌షో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయం వద్ద నలుమూలల నుంచి వచ్చిన జనాలు పూలదండలతో ఘనస్వాగతం పలికి ముంచెత్తారు. అక్కడి నుంచి పాత బస్టాండు, తాడిపత్రి రోడ్డు, తేరురోడ్డు, రోడ్‌షో నిర్వహించారు. పలగాడి సెంటర్ సమీపాన రోడ్డుషోలో నాయకులు మాట్లాడారు. మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి , జనసేన నాయకులు నాగార్జున ,టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, డాక్టర్ రాజేష్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, టీడీపీ మండలాధ్యక్షుడు సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, ఆరు మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ గూటికి అంబటి



ఎర్రగుంట్ల, ఏప్రిల్ 25: ప్రభుత్వ వ్యవసాయశాఖ మాజీ ప్రధాన సలహాదారుడు తిప్పలూరు మాజీ సర్పంచ్ అంబటి క్రిష్ణారెడ్డి గురువారం బీజేపి తీర్థం పుచ్చుకున్నారు. తిప్పలూరు నుంచి 150 కుటుంబాలతో ఆయన జమ్మలమడుగులో బీజేపీ జాతీయ నాయకుడు, ధర్మవరం బీజేపీ అభ్యర్థి సత్యకుమార్, జమ్మలమడుగు ఎన్డీయే అభ్యర్థి సి.ఆదినారాయణరెడ్డి సమక్షంలో బీజేపి కండువా కప్పుకున్నారు. గ్రామంలో అందరినీ కలుపుకుని పోయి నియోజవర్గంలో కూడా ప్రచారం నిర్వహిస్తానన్నారు.

ఎండిపోతున్న చెరువులు, కాలువలు



ఎండిపోయిన దక్షిణ కాలువ

జమ్మలమడుగు, ఏప్రిల్ 25: జమ్మలమడుగు మండలంలోని సున్నపురాళ్లపల్లి, గూడెం చెరువు, కన్నెతీర్థం తదితర ప్రాంతాల్లోని చెరువులు, కాలువలు ఎండుతున్నాయి. మైలవరం జలాశయం నుంచి ఆయకట్టు ప్రాంతానికి నీరు అందించడానికి జలాశయంలో నీరు అంతంతమాత్రంగా ఉండి కేవలం తాగునీటి ఇబ్బందులు కలుగకుండా సరఫరా చేసేందుకు మాత్రమే నీళ్లు ఉన్నాయి. అయితే జమ్మలమడుగు మండలంలోని పలు గ్రామాల్లో చిన్న చెరువు, పెద్ద చెరువు ఎండిపోవడం, దక్షిణ కాలువ ఎండిపోవడంతో కొందరు పంటలు సాగు చేసిన రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు కన్నెతీర్థం, సున్నపురాళ్లపల్లె గ్రామాల రైతులు తెలిపారు. ఇప్పటికే బోర్లలో నీరు అడుగంటి ఎక్కడం లేదని స్థానికులు తెలిపారు.

ప్రొద్దుటూరుకు వరద నాయకత్వం అవసరం



12 వవార్డు ప్రచారంలో పాల్గొన్న వరద కుటుంబసభ్యులు

ప్రొద్దుటూరు ,ఏప్రిల్ 25 :ప్రొద్దుటూరుకు నంద్యాల వరదరాజులరెడ్డి నాయకత్వం అవసరమని వచ్చే ఎన్నికల్లో ఆయనను ఎమ్మెల్యేగా వరదరాజులరెడ్డిని ఎంపీగా భూపేశ్‌రెడ్డిని గెలిపించుకోవాలని వరదరాజులరెడ్డి కుమార్తెలు అనురాధ, అరుణ భూపేశ్ సతీమణి జ్యోతి పేర్కొన్నారు. గురువారం స్థానిక 12వవార్డులో కూటమి అభ్యర్థుల గెలుపుకోసం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో షేర్‌అలీ, ముల్లా హుస్సేన్, షబ్బీర్ అహ్మద్, అజ్మత్, సుమన్, నాయబ్‌రసూల్, పవన్ హరి,బోగాల లక్ష్మీనారాయణమ్మ, బీజేపీ నేత బోగా శివకల్యాణి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే అన్ని వర్గాలకు సంక్షేమం



వైఎంఆర్‌కాలనీ ప్రచారంలో పాల్గొన్న వరద సోదరులు

ప్రొద్దుటూరు ,ఏప్రిల్ 25 : టీడీపీతోనే అన్ని వర్గాలకు సంక్షేమం సాధ్యమౌతుందని మాజీ ఎమ్మెల్యేసోదరులు నంద్యాల భార్గవ రెడ్డి, నంద్యాల ప్రసాద్‌రెడ్డి, నంద్యాల హనుమంతరెడ్డి పేర్కొన్నారు. గురువార 6 వ వార్డులో వరదరాజులరెడ్డి భూపేష్ రెడ్డిలను ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులుగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ తాటి శ్రీనుయాదవ్, ఎర్రన్న రామోమ్మహన్‌రెడ్డి, సుబ్బారెడ్డి, నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటుతోనే వైసీపీకి బుద్ధిచెప్పాలి



బద్వేలులోని 7వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న బొజ్జ అరుణమ్మ

బద్వేలుటౌన్,ఏప్రిల్ 25 : వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి గత ఐదేళ్ల కాలంలో అన్నివర్గాల ప్రజలను ఒక్కచాన్స్ అంటూ పాదయాత్రలో మోసపూరిత హామీలను ఇచ్చి అధికారం వచ్చిన తరువాత వాటిని తుంగలోతొక్కారని ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జ రోశన్న సతీమణి అరుణమ్మ, టీడీపీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు మాచుపల్లె లక్ష్మీదేవి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని 7వ వార్డులో ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంచుతూ బొజ్జా రోశన్నకు ఒక్క అవకాశం ఇవ్వండి బద్వేలు మున్సిపాలిటీని అభివృద్ధిచేసిచూపిస్తామంటూ కరపత్రాలను పంచారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సీనియర్‌న్యాయవాది పీపీఎస్ ప్రసాద్, సింగసాని విజయ్, షరీఫ్, రాజా, రమణయ్య తదితరులుపాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో నారాయణ హవా



విద్యార్థులను అభినందిస్తున్న నారాయణ కళాశాల యాజమాన్యం

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 25 : జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో కడప నారాయణ కళాశాల విద్యార్థులు హవా కొనసాగించారని కళాశాల ప్రిన్సిపాల్స్ మురళీమోహన్, వెంకటస్వామి, రాఘవరెడ్డి, సుధాకర్‌రెడ్డి తెలిపారు. చైతన్యక్రిష్ణ ఆలిండియా స్థాయిలో 360 ర్యాంకు సాధించారన్నారు. అలాగే ఎం.హాసిని 1169వ ర్యాంకు, హితేష్‌రెడ్డి 1735 ర్యాంకు, ఆర్.నిఖిల్ 2012, ఎస్.అహ్మద్‌అజిత్ 2204, కె.మేఘనారెడ్డి 2500, వై.వినయ్ రెడ్డి 3320, బింద్ర 3663, సాయివైష్ణవి 4327, లక్ష్మీసాయి హాసిని 4787, జాగృతి 13425. నీరజ్ శబరి 14761, సాయిరుషికేశ్ 15426, నిఖిల సంధ్య 18396, రోహిత్‌రెడ్డి 45261 ర్యాంకు సాధించారన్నారు. 150 మందికి పైగా విద్యార్థులు జేఈఈ అడ్వాన్సు ఫలితాల్లో అర్హత పొందారని తెలిపారు. విద్యార్థులను అలాగే అధ్యాపక బృందానికి రామ్మోహన్‌రెడ్డి, కో-డీన్ చంద్రకిశోర్‌రెడ్డి, ఏజీయం చెన్నకిష్టారెడ్డి, వెంకటరామిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కేశవరెడ్డి అభినందించారు.

పుట్టా సుధాకర్‌యాదవ్ ముమ్మర ప్రచారం



మైదుకూరులో ఇంటింటి ప్రచారం చేస్తున్న పుట్టా సుధాకర్‌యాదవ్

మైదుకూరు, ఏప్రిల్ 25 : మైదుకూరు టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ అలుపెరుగకుండా ముమ్మరంగా ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి వరకు గ్రామాల్లో కలియ తిరుగుతూ ప్రచారం సాగిస్తూ మరో వైపు వైసీపీ నాయకులను టీడీపీలోకి చేర్చుకుంటున్నారు. తాజాగా గురువారం ఉదయం 6 గంటలకే పట్టణ పరిధిలోని 11వ వార్డులో సాయినాధపురం ప్రాంతంలో ఇంటింటి వద్ద సైకిల్ గుర్తుకు ఓటేయాలంటూ ప్రచారం చేశారు. టీడీపీ అధికారంలోకి వస్తే అమలు చేసే సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఒక్కసారి గెలిపిస్తే నిజాయితీగా సేవ చేస్తా : పుట్టా

చాపాడు, ఏప్రిల్ 25: ఎన్నికల్లో తనను ఒక్క సారి గెలిపిస్తే నిజాయితీగా ప్రజలకు సేవ చేస్తానని మైదుకూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. రాజువారిపేట గ్రామంలో గురువారం సాయంత్రం సుధాకర్‌యాదవ్ బాబు ష్యూరిటీ, భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి గ్రామస్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పిచ్చపాటి మునిశేఖర్‌రెడ్డి, టీడీపీ నాయకులు పాలగిరి వేమారెడ్డి, గురివిరెడ్డి, నారపురెడ్డి, వీరారెడ్డి, రజని, అక్బర్, అక్బర్ సలీం, నాయబ్‌రసూల్, హర్ష, బయపురెడ్డి, వీరశేఖర్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, కొండారెడ్డి, బానుమియా తదితరులు పాల్గొన్నారు.

బి.మఠంలో ఇంటింటి ప్రచారంలో టీడీపీ నేతలు



అంబేడ్కర్‌నగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బి.మఠం టీడీపీ నేతలు

బ్రహ్మంగారిమఠం, ఏప్రిల్ 25 : బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని స్థానిక పోలేరమ్మ నగర్, కక్కయ్యనగర్, జింకల నగర్, అంబేడ్కర్ నగర్‌లలో మైదుకూరు నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ సోదరుడు పుట్టా ఆనంద్‌యాదవ్ ఇంటింటి ప్రచారాన్ని చేపట్టారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మైదుకూరు ఎమ్మెల్యేగా పుట్టా సుధాకర్‌యాదవ్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చెన్ను పల్లి సుబ్బారెడ్డి, ముదుమాల పోలిరెడ్డి, శ్రీయపురెడ్డిశ్రీనివాసులరెడ్డి, సాంబశివారెడ్డి, మల్లికార్జునరెడ్డి, తిప్పన జయరాంనాయుడు, పురుషోత్తంరెడ్డి, సురేంద్రనాథరెడ్డి, ఓబుల్‌రెడ్డి, బాలక్రిష్ణ, చలపతి, సులమల నారాయణ, నాగయ్య, తిప్పన రాఘవేంద్ర, రవీంద్ర, సారే రామానాయుడు, ప్రముఖ లాయరు పట్టాభిరాముడు,ఎమ్మార్పీఎస్ నేత చెన్నయ్య, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నామ మాత్రంగా మండల సర్వసభ్యసమావేశం

ముద్దనూరు, ఏప్రిల్25: స్థానిక ఎంపీడీవో కార్యాలయ సభాభవనంలో గురువారం ఎంపీడీవో చంద్రమౌళి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఎంపీటీసీ సభ్యులు నలుగురు హాజరవడంతో మీటింగ్ నిర్వహించారు.ప్రధానంగా శానిటేషన్, మంచినీటి సమస్యల పై సమావేశం ప్రస్తావించి, నామ మాత్రంగా సమావేశం ముగించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సెక్రటరీలు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

మలేరియాపట్ల అప్రమత్తంగా ఉండాలి

ఖాజీపేట, ఏప్రిల్ 25: ప్రతి ఒక్కరు మలేరియాపట్ల అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి ముబీన్ అన్నారు. గురువారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆరోగ్య కేంద్రం నుంచి బస్టాండు కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు.ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ప్రతి గ్రామంలో పర్యటించి ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో అరుణకుమారి, శోభన్‌బాబు, క్రిష్ణప్రియ, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బి.కోడూరు..: మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు వినీత్‌కుమార్‌రాజు, ఉదయ్‌కిరణ్ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ మలేరియా దినోత్సవం ఘనంగా నిర్వహిచారు. ఈ కార్యక్రమంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ దోమలు చెరువులు, మురికినీటి గుంతలు, పాత టైర్లు, వాడి పడేసిన కొబ్బరిబోండాలు, నీటి తొట్లు తదితర వాటిలో గుడ్లు పెట్టి సంతానం అభివృద్ధి చేస్తాయన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో నాగ మణి, హెల్త్ సూపర్‌వైజరు జాన్ విలియం, విజయలక్ష్మి, నాగేశ్వర్‌రావు, ఆశా కార్యకర్తలు నాల్గొన్నారు.

గోపవరం..: ప్రపంచ మలేరియాదినత్సోవాన్ని గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలోభాగంగా చిన్న గోపవరం, రంగసముద్రం గ్రామాల్లో ర్యాలీ కార్యక్రమం చేపట్టారు. వైద్యాధికారులు మురళీక్రిష్ణ, మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ మలేరియా వ్యాప్తి చెందించే దోమలను నిర్మూలనకు ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ సబ్‌యూనిట్‌అధికారి బ్రహ్మాజీ, సీహెచ్‌వో గౌస్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: మలేరియాతో పోరాటం ఉధృతం చేయాలని వైద్యులు మేరీ ఐరీషా, కరిష్మా పేర్కొన్నారు. గురువారం పోరుమామిళ్ల వైద్యవిధాన పరిషత్ కార్యాలయంలో పూర్తిస్థాయిలో మలేరియాను నిర్మూలించాలనే ఉద్దేశ్యంతో ర్యాలీ నిర్వహించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో నిర్మల, ఆరోగ్య విద్యాధికారి సాదు వెంకటేశ్వర్లు, మలేరియా సబ్ యూనిట్ అధికారి నరసింహారెడ్డి, రఘురాములు, నాగమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దముడియం..: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే ఎలాంటి ప్రాణాంత వ్యాధులు రావని ఎంపీడీవో లక్ష్మీనరసింహ పేర్కొన్నారు. మండల కేంద్రమైన పెద్దముడియం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద గురువారం ప్రపంచ మలేరియా దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మండలంలోని వైద్యసిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.





ఖాజీపేట, బీకోడూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది తదితరులు